
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 26.06.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 04 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



*ఒక ఎస్ఐ... తన స్టేషన్ పరిధిలో ప్రజలకు అంతో ఇంతో పనిచేయగలడు. ఒక తహశీల్దార్ మండల పరిధిలో కొంతవరకైనా ప్రజల సమస్యలు తీర్చగలడు. ఒక ఎమ్మెల్యే... పదవీకాలంలో తన నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడేలా ఎంతో కొంత పనిచేసి చూపించగలడు. చిన్న స్థాయి అధికారులే తమ స్థాయిలో ప్రజలకు కాస్తోకూస్తో మేలు చేస్తున్నప్పుడు, మరి ఒక రాష్ట్ర మంత్రి, అది కూడా ప్రభుత్వంలో కీలకమైన మంత్రి తన జిల్లాకు ఎంత పని చేసి ఉండాలి?*

### నరక కూపంగా నగరం

# మాటలు తప్ప చేతలేవి?

### › మంత్రి ఇలాకాలో అభివృద్ధి శూన్యం › ఇదేం పాలన నారాయణా..?

***ఒక రాష్ట్ర మంత్రి తన సొంత జిల్లాకు చాలానే చేసి ఉండాలి. అయితే ఇది ఎవరు చేయగలరంటే తన జిల్లా పట్ల, తన ప్రాంతం పట్ల అభిమానం ఉన్నోళ్లు, తన ప్రజలకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉన్నోళ్లే చేయగలరు. ప్రజల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు కొంతవరకైనా తెలిసిన వాళ్లు మంత్రులుగా ఉంటే చేయగలరు. అంతేగాని ధనిక, పేద తేడా లేకుండా ఫీజులు పిండుతూ విద్యను పెద్ద కార్పొరేట్ వ్యవస్థగా మార్చుకున్న వాళ్లు మంత్రులైతే ప్రజల కోసం రూపాయి పని కూడా చేయలేరు.***

దీనికి ప్రత్యక్ష సాక్ష్యం నెల్లూరుజిల్లానే! కార్పొరేట్ విద్యాసంస్థల అధినేత అయిన పి.నారాయణ మన జిల్లా నుండి మంత్రిగా ఉన్నారు. మంత్రై ఏడాది దాటింది. జిల్లాలో ఏ మూల కూడా చెప్పుకోదగ్గ పని ఒక్కటీ చేయలేదు. అంతెందుకు మున్సిపల్ శాఖ పరిధిలోనే మంజూరైన నిధులు కూడా వెనక్కివెళ్లాయి. సూళ్లూరుపేట మున్సిపాల్టీ పరిధిలో వట్రపాలెంలో, నెల్లూరు సుందరయ్యనగర్‌లో మోడ్రన్ కాలనీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రాజీవ్ ఆవాస్ యోజన క్రింద నిధులు మంజూరు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం దీనికి మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాలి. మున్సిపల్ మంత్రిగా నారాయణే దీనిని పట్టించుకోవాలి. పూర్తిగా సింగపూర్ రాజధాని మైకంలో వున్న నారాయణ దీనిని విస్మరించడంతో ఈ రెండు ప్రాజెక్ట్‌లు వెనక్కిపోయాయి.

మంత్రిగా నారాయణ జిల్లా అభివృద్ధిపై ఎంతమాత్రం ఆసక్తి చూపడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఆయనకు చనువు వుంది. గట్టిగా అడిగి సాధించుకునే స్వతంత్రముంది. అయినా ఆయన దానిని ఉపయోగించడం లేదు. సరికదా, నెల్లూరుజిల్లాకు ఏమీ అడగొద్దని చంద్రబాబే అన్నాడంటూ తన నిస్సహాయతను బయటపెట్టారు. నెల్లూరుజిల్లా మీద చంద్రబాబుకు అంత అయిష్టంగా ఉంటే ఈ జిల్లాను తమిళనాడులో కలిపే ప్రతిపాదన పెడితే సరి! అలానన్నా ఈ జిల్లా బాగుపడుతుందేమో!

(మిగతా 11వ పేజీలో)

## నారీ నారీ నడుమ మురారి!



## గవర్నర్ డబుల్ యాక్షన్

ఏడాది క్రితం ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. రెండు రాష్ట్రాలకు రెండు ప్రభుత్వాలు, ఇద్దరు ముఖ్యమంత్రులు, రెండు అసెంబ్లీలు, రెండు సచివాలయాలు... ఇలా చాలా వరకు అన్నీ రెండు రెండుగా ఏర్పడ్డాయి. కాని విభజన జరిగి ఏడాది దాటిపోయినా ఇరు రాష్ట్రాలకు గవర్నర్ మాత్రం ఒకరే ఉన్నారు. దీంతో ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడల్లా ఆయన పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారుతోంది.

గవర్నర్ నరసింహన్‌కు నిజాయితీపరుడిగా,

(మిగతా 11వ పేజీలో)






# కయ్యమా? వియ్యమా?

### • కేసీఆర్ చల్లబడ్డాడా? • కేంద్రం రాజీ చేసిందా? • చంద్రబాబుకు అభయం లభించిందా?

*తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు-నోటు ఎపిసోడ్ మొదలై అప్పుడే నెలరోజులు కావస్తుంది. ఈ కేసులో జీరో స్థాయి నుండి మొదలైన విచారణ ప్రస్తుతం తారాస్థాయికి చేరింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు తెలుగుదేశం ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి జైల్‌లోనే ఉన్నాడు. ఇప్పుడు కేసులో ప్రధాన దృష్టంతా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మీదే! ఈ కేసులో ఆయన పాత్రెంత? ఆయన పాత్ర ఉన్నట్లు ఆధారాలున్నాయా? స్టీఫెన్‌సన్‌తో మాట్లాడింది ఆయనేనా? మాట్లాడిన మాటలను బట్టి కేసు పెట్టొచ్చా? అసలు చంద్రబాబును అరెస్ట్ చేయగలరా? కేంద్రం ఈ కేసులో తల దూర్చకుండా వుంటుందా? ఈ కొద్ది రోజుల్లోనే ఇరు రాష్ట్రాల్లో సవాలక్ష సందేహాలు తలెత్తాయి.*

ఓటు-నోటు కేసులో తెలంగాణ ఏసిబి అధికారులు పక్కాగా తమ పని తాము చేసుకుపోతున్నారు. లభించిన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడం, కోర్టు ద్వారా నిందితులకు నోటీసులు జారీ చేయడం చేస్తున్నారు.

(మిగతా 11వ పేజీలో)

## విధుల్లో నిర్లక్ష్యంపై...

# కలెక్టర్ సీరియస్

నెల్లూరుజిల్లా సైదాపురం మండలం ఎంపీడీఓ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ రమేష్‌లను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.జానకి సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఇప్పటికీ చేపట్టని మండలాల్లోని పంచాయితీ కార్యదర్శులను కూడా సస్పెండ్ చేయాలని పంచాయితీరాజ్ అధికారులకు సూచించారు. ఒకటి, రెండు పనులు చేపట్టి విధి నిర్వహణలో తాత్సారం చేస్తున్న పంచాయితీ కార్యదర్శుల జీతాలను ఈ నెల నుంచి ఆపేయాలన్నారు. వారికి కేటాయించిన వ్యక్తిగత మరుగుదొడ్ల పనులు 50 శాతం పూర్తయిన తర్వాత నుంచే వారికి నెలజీతాలు ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో



గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు చేయని మండలాల్లో అక్కడికి కేటాయించిన ఆ పథకం పనులను ఇతర మండలాలకు బదిలీ చేయాలని ఆదేశించారు. నెల్లూరు జిల్లా సచివాలయంలో బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాల్లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం అమలు తీరు, నీరు–చెట్టు, పనికి ఆహారపథకం, ఆరోగ్యం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ విధులను సక్రమంగా నిర్వహించని అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ సమావేశంలో జడ్పీ ఇన్‌ఛార్జి సిఇఓ చంద్రమౌళి, సిపిఓ వెంకయ్య, డ్వామా పిడి వెంకటసుబ్బయ్య, ఐసిడిఎస్ పిఓ వెంకటేశ్వర్లు, బిసి కార్పొరేషన్ ఇఓ డాక్టర్ కోటేశ్వరరావు, ఆర్డీఓ రవీంద్ర పాల్గొన్నారు.


సింహపురి సమాచారం

## సమయ్‌జాన్ రావు విచారణ ముగిసింది

నవజీవన ఎక్స్‌ప్రెస్ రైలులో రూ. 86 లక్షల దోపిడీలో కీలక సూత్రధారిగా భావిస్తున్న మార్కాపురం ఒఎస్డీ సమయ్‌జాన్‌రావును కావలి పోలీసు కస్టడీ నుంచి బుధవారం రిమాండ్‌కు తరలించారు. మూడవ రోజు కావలికి వచ్చిన జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ అత్యంత గోప్యంగా విచారణ చేపట్టారు. మూడు రోజులు పాటు జరిగిన విచారణలో పోలీసులు అత్యంత కీలక సమాచారం కనుగొన్నట్లు తెలుస్తోంది. విచారణ వివరాలను గుంటూరు రేంజ్ ఐజికి పోలీసు అధికారులు నివేదించినట్లు సమాచారం. అడిషనల్ ఎస్పీ స్థాయిలో వున్న సమయ్‌జాన్ రావును అరెస్టు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు మీడియాకు చూపలేదు. విచారణలో కావలి డీఎస్పీ రాఘవరావు, గూడూరు డీఎస్పీ శ్రీనివాస్, సత్తెనపల్లి డీఎస్పీ మదుసుధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## పులికాట్‌లో కూలిన వంతెన

నెల్లూరు జిల్లా దొరవారిసత్రం మండలంలోని మీజూరు సమీపంలో పులికాట్ సరస్సులో ఉన్న వంతెన మంగళవారం తెల్లవారుజామున ఓవైపు కూలిపోయింది. అధికలోడు ధాన్యం లారీ ఈ వంతెనపై వెళ్ళడంతో కూలిపోయినట్లు సమాచారం. గతంలో దెబ్బతిన్న ఈ వంతెనకు రోడ్లు భవనల శాఖాధికారులు మరమ్మత్తులు చేసి భారీవాహనాలు వెళ్ల రాదంటూ సూచిక బోర్డులు ఏర్పాటు చేసినా వాహన దారులు లెక్క చేయకుండా వెళ్లడంతో వంతెన కూలిపోయింది. విషయం తెలుసుకున్న తహశీల్దారు జి.శ్రీనివాసరావు, రోడ్లు భవనల శాఖ ఏ ఇ పద్మజ వంతెనను పరిశీలించారు. అడుగు భాగంలో ఉన్న ఇనుపదిమ్మెలు దెబ్బతిని వంతెన కూలినట్లు నిర్ధారించారు. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలియజేసి చర్యలు తీసుకుంటామన్నారు వంతెనపై వాహనలు వెళ్లారాదంటూ సూచిక బోర్డులు ఏర్పాటు చేసారు.





## కేటుగాళ్ళు అరెస్ట్

డబ్బు, నగలే లక్ష్యంగా పగలంతా రెక్కీ చేసి రాత్రిళ్ళు చోరీలు చేసే ముగ్గురు కేటుగాళ్ళను 20వ తేదీ పోలీసులు అరెస్టు చేసారు. ఇటీవల వెంగమాంబనగర్‌లో దొంగలించిన రూ. 1.85లక్షలు విలువగల సొత్తును వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు. కోట మండలం విద్యానగర్‌లో కూడా దొంగతనానికి పాల్పడి రూ. 33వేల నగదు, మోటార్ సైకిల్, సెల్‌ఫోన్‌ను అపహరించుకు వెళ్లారు. దగదర్తి మండలం పెదపుత్తేడు శివాలయం, గ్రామదేవత దేశమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ఈ సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవలకాలంలో ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు దొంగలను అరెస్టు చేస్తున్నా, చోరీలు మాత్రం ఆగడం లేదు. సిసిఎస్ అధికారుల నిర్లక్ష్యమే వరుస దొంగతనాలకు కారణమని ఇటీవల ఐజి అసహనం వ్యక్తం చేశారు.

## బావిలో దిగి మృత్యువాత

నెల్లూరుజిల్లా చిట్టమూరు మండలం పల్లమాలకు చెందిన చెంచు కష్ణారెడ్డి(60) తడలో తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తడ కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల వెనుక వైపు వున్న ఓ ఇంటి బావిలోని పూడిక తీసేందుకు బావిలో దిగిన కృష్ణారెడ్డి ఆక్సిజన్ అందక మృతి చెందాడు. బావిలో దిగిన వ్యక్తి ఎంతకీ పైకి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇంటి యజమాని పోలీసు, 108కి సమాచారం అందించాడు. దాదాపు 70అడుగుల మేర వున్న ఈ వరల బావిలో దిగి మృతదేహాన్ని బయటకు తీసేందుకు ఎవరూ సాహసించలేదు. అగ్నిమాపక సిబ్బంది ఓ కోడిని దారం సాయంతో బావిలోకి దింపి పరిశీలించారు. బావిలో దిగిన కోడి రెండు నిమిషాల్లోనే అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. అగ్నిమాపక సిబ్బంది అయిదు గంటలపాటు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీసారు.








# అన్నమయ్య చెంత... మాంసం, మద్యం సంత!

***అది గుడా... బడా అన్న తేడా లేదు... కాపురాలుంటున్న కాలనీలని కూడా చూడరు... మహనీయుల విగ్రహాలున్నా పట్టింపులేదు... ఎక్కడ బడితే అక్కడ మద్యంషాపులు, మాంసాహార అంగళ్లు... ఇదీ నెల్లూరు నగరంలో పరిస్థితి.***

మద్యం వ్యాపారం విచ్చలవిడి కావడం, వైన్‌షాపుల సంఖ్య పెరిగిపోవడంతో వీటిని జనావాసాల మధ్యనే పెట్టేస్తున్నారు. నగరంలో మాగుంట లే అవుట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ధనికులే కాక విద్యావంతులు, అధికారులు ఉండే ప్రాంతం. ఇక విశ్వసాయి, రత్నం, నారాయణ, ఓవెల్, రెయిన్‌బో, గోమతి, శ్రీచైతన్య, ఎస్‌ఆర్‌కె, కెకెఆర్ గౌతం వంటి పేరెన్నిగన్న విద్యాసంస్థలన్నీ ఇక్కడే వున్నాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, ఇస్కాన్ మందిరం వంటి ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు మినీబైపాస్‌రోడ్డు మీదే పదకవితా పితామహుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహాన్ని కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో నెలకొల్పారు. ఇవన్నీ కూడా ఈ ప్రాంత విశిష్టతను, ప్రశాంతతను గుర్తు చేస్తాయి.

అయితే ఏడాది క్రితం మాగుంట లే అవుట్‌లో కూడా ఒక వైన్‌షాపు పెట్టారు. గోమతి స్కూల్ రోడ్డు ఎదురుగా మినీ బైపాస్‌రోడ్డును ఆనుకుని పెట్టిన ఈ షాపు వల్ల ఈ ప్రాంతంలో కలుషిత వాతావరణం చోటుచేసుకుంది. రాత్రి పగలు అన్నతేడా లేకుండా ఈ ప్రాంతం తాగుబోతుల అడ్డాగా మారింది. ఈ వైన్‌షాపు మూలంగా ఆ ప్రాంతంలో ఖాళీ స్థలాల యజమానులు ఇళ్లు కట్టుకోవడానికి భయపడుతున్నారు. వైన్‌షాపు వద్ద ప్రతిరోజూ తాగుబోతుల గొడవలే! దీంతో ఆ రోడ్డున పోవాలంటేనే భయపడుతున్నారు. ఇక్కడ వైన్‌షాపు రావడంతో అన్నమయ్య విగ్రహం పరిసరాల్లోనే చికెన్ పకోడా బండ్లు వచ్చాయి. ఇక చేపలు అమ్ముకునేవాళ్లు, ఇతర మాంసాహారం అమ్మే వాళ్లంతా ఇక్కడ పోగవుతున్నారు. అన్నమయ్య విగ్రహం వద్ద ఏదన్నా సంగీత కార్యక్రమం పెట్టుకుందామన్నా ఈ చికెన్ పకోడా వాసనలను పీలుస్తూ అక్కడ నిలవలేని పరిస్థితి. ఎన్నో విద్యాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు, పెద్ద నివాసప్రాంతమైన మాగుంట లే అవుట్‌లో వున్న వైన్‌షాపును ఈ సంవత్సరమైనా తొలగించి, తమను ప్రశాంతంగా ఉంచాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ఈ సమస్యపై దృష్టి పెట్టాలి.

### జూన్ 28న అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం

## నెల్లూరుజిల్లా శాఖ సర్వసభ్య సమావేశం

అఖిల గాండ్ల, తెలికుల సంఘం నెల్లూరుజిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని జూన్ 28వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్రా ప్రాంతంలో ఉన్న 13జిల్లాలకు సంబంధించి ప్రస్తుతం రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా గ్రోసు గోపాలయ్య కొనసాగుతున్నారు. నెల్లూరు, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, సైదాపురం, లేబూరు, ఊటుకూరు, పొదలకూరు, కోవూరు మరియు బుచ్చిరెడ్డిపాళెం శాఖలకు సంబంధించి, దాంతో పాటు జిల్లా సంఘానికి సైతం నూతన కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు.

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ వేంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రం ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రి గారైన భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ వ్యవస్థాపకులు శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన భూమి పూజ కార్యక్రమాన్ని విగ్రహ ప్రతిష్టాపక కమిటి ఆధ్వర్యంలో జూలై 3వ తేదీ శుక్రవారం ఉదయం నిర్వహించనున్న సందర్భంగా తమ కుల గురువు విగ్రహప్రతిష్టాపక భూమి పూజలో సైతం అధిక సంఖ్యలో తమ కులస్తులు పాల్గొనేలా ఈ సమావేశంలో తీర్మానించడంతో పాటు విగ్రహ భూమి పూజ మరియు ప్రారంభోత్సవ ఏర్పాట్లను సైతం సమీక్షించుకోనున్నట్లు, అలాగే ఈ రెండు కార్యక్రమాలను తమ కులస్తులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని నభూతోనభవిష్యత్‌లా నిర్వహించుకునేలా సహాయ సహకారాలు అందించాలని తీర్మానించుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంతో పాటు 3వ తారీఖు జరగనున్న భూమిపూజలో కూడా అధికసంఖ్యలో తమ కులస్తులు, సంగీత కళాకారులు పాల్గొనవలసిందిగా ఈ సందర్భంగా గోపాలయ్య పిలుపునిచ్చారు.

## రాజకీయ కంపు రేపిన ఎంపీటీసీల క్యాంపు

ఓ పక్క ఓటు – 5కోట్లు కేసు రాజకీయ సెగలను రగిలిస్తూనే వుంది. కేంద్రప్రభుత్వమే ఈ కేసులో తల పెట్టలేక తంటాలు పడుతుంది. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల కొనుగోలుకు ప్రయత్నించి తెలుగుదేశం నాయకులు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఈ కేసుపై పెద్దఎత్తున వివాదం నడుస్తుండగానే, తెలుగుదేశం నాయకులు మళ్లీ అదే పనికి తెగబడ్డారు.

ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి నియోజకవర్గానికి జూలై 3వ తేదీ ఎన్నిక జరగబోతుంది. తెలుగుదేశం అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా అట్ల వెంకటరెడ్డి తలపడుతున్నారు. ప్రకాశం జిల్లా స్థానిక సంస్థలలో వైకాపాకే ఆధిక్యం వుంది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక వైకాపా నుండి కొందరు స్థానిక సంస్థల ప్రతినిధులు తెలుగుదేశంలో చేరారు. దీనివల్ల గతంలో భారీగా వున్న తేడా ఇప్పుడు దగ్గరదగ్గరగా వచ్చింది. ఇప్పటికి కూడా తెలుగుదేశం కంటే వైకాపాకే 25మంది సభ్యులు అదనంగా ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీల పరంగా ఎవరి ఓట్లు వాళ్లే వేసుకుంటే అక్కడ ఖచ్చితంగా వైకాపా అభ్యర్థే గెలుస్తాడు. కాని తెలుగుదేశం అధికారంలో వుంది కాబట్టి కొంతమంది వైకాపా సభ్యులను తమ పార్టీలోకి లాక్కునైనా గెలవవచ్చనే ధీమాతోనే మాగుంట శ్రీనివాసులురెడ్డి అభ్యర్థిగా రంగంలోకి దిగాడు. అలాగే అధికారాన్ని ఉపయోగించుకుని వైకాపా సభ్యులను రాబట్టే ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థల సభ్యులకు ఒక్కో ఓటుకు 2లక్షల విలువ కట్టారు. అలా బేరం కుదుర్చుకుని 30మంది ఎంపీటీసీలను నెల్లూరుకు తీసుకొచ్చారు. ట్రంకురోడ్డులోని సప్తగిరి లాడ్జిలో క్యాంపు పెట్టారు. ఈ విషయం నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు తెలిసింది. వాళ్లు తమ అనుచరులతో లాడ్జిని ముట్టడించారు. ప్రకాశం జిల్లా ఎంపీటీసీలను క్యాంప్ నుండి బయటకు రప్పించారు. ఈ సమయంలో లాడ్జి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది.

### క్యాంపు మీదే... కాదు మీదే...





ఈ క్యాంపుపై తెలుగుదేశం, వైకాపా నేతల మధ్య విమర్శల యుద్ధం మొదలైంది. సప్తగిరి లాడ్జిలోకి వెళ్లి ఎంపీటీసీలను బయటకు తీసుకువచ్చిన వైకాపా నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. కాగా, ఈ క్యాంపు వైయస్సార్ కాంగ్రెస్ వారిదేనని, ఆ పార్టీ వాళ్లే వారిని తీసుకువచ్చి, తమపై నింద మోపుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆరోపించాడు. వైకాపా ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఈ క్యాంపుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల ఓట్ల కొనుగోలుకు పాల్పడి దొంగల్లా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినా, తెలుగుదేశం నాయకులకు ఇంకా బుద్ధిరాలేదని, ప్రకాశం ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా తమ అధికార దుర్వినియోగానికి వాళ్లు మరోసారి తెర తీసారని ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు ఆరోపించారు.

### అంతర్జాతీయ యోగాడే నాడు

## భారత్‌కు బంగారు కానుక

### ఆసియా అంతర్జాతీయ యోగా పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన నెల్లూరు చిన్నారి జ్యోష్ణవి

జూలై 21వ తేదీ... అంతర్జాతీయ యోగా దినోత్సవం. ప్రపంచమంతా జరుపుకున్న తొలి దినోత్సవం. అదేరోజున థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన 5వ ఆసియా అంతర్జాతీయ యోగా పోటీలలో అండర్–17 విభాగంలో తన అద్భుత ప్రతిభతో విజేతగా నిలిచి భారత్‌కు యోగాడే బహుమతిగా బంగారు పతకాన్ని అందించింది నెల్లూరు నగరానికి చెందిన ఏకాంబరం జ్యోష్ణవి. తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజే జ్యోష్ణవి అంతర్జాతీయ యోగా పోటీలలో బంగారు పతకం గెలుపొందడం విశేషం. బ్యాంకాక్‌లో జరిగిన ఈ పోటీలలో పలు దేశాల యోగా క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే ఆర్టిస్టిక్, రిథమిక్ యోగా విభాగాల్లోనూ జ్యోష్ణవి ఫైనల్స్ దాకా వెళ్లి తన సత్తా చాటింది. అంతర్జాతీయ యోగాడే నాడు భారత్‌కు బంగారు పతకాన్ని అందించి నెల్లూరుజిల్లా కీర్తిని చాటిన జ్యోష్ణవికి 'లాయర్' అభినందనలు.




పదవీ విరమణ శుభాకాంక్షలు




ఆంధ్రాబ్యాంకులో 33 సంవత్సరాలు సేవ చేసి సిబ్బంది, ప్రజలచేత మితభాషిగా మంచి మనసున్న వ్యక్తిగా కీర్తింపబడ్డ

పాముల శివసుబ్రహ్మణ్యం

తే. 30.06.2015ది పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ...

వారి భావిజీవితం సుఖసంతోషాలతో వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ...

మేనేజర్ & స్టాఫ్

ఆంధ్రాబ్యాంక్, అన్నమయ్య సర్కిల్ బ్రాంచి, నెల్లూరు.

# 'ప్రభా'తం

సాధారణంగా యోగం అంటే అదృష్టం అనే భావనతో వ్యవహరిస్తుంటారు. వారిది 'మంచి యోగం' కాబట్టే అంతటి ఘనత దక్కిందనే మాట అప్పుడప్పుడూ వింటూనే వుంటాం. ఇప్పుడా మాట యోగాకే దక్కింది. సాక్షాత్తూ యోగాకే ఇప్పుడు మహాయోగం సిద్ధించింది. ఒక్క భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో విన్నా..ఇప్పుడు యోగా మాటే మారుమ్రోగుతోంది. అందరి నోటా యోగా మహామంత్రమై పలుకుతోంది. ప్రపంచంలోనే తొలిసారిగా జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటితమైంది. దీంతో, భారతీయ ప్రాచీన సంస్కృతిలో భాగమైన యోగా.. నేడు అంతర్జాతీయ విఖ్యాతిని సంతరించుకుంది. ఆ రోజున యావద్భారత దేశంతో సహా ప్రపంచమంతా యోగాసనాల ప్రదర్శనలతో, యోగసాధనలతో పులకించిపోయింది. జూన్ 21.. ప్రపంచ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయిన రోజైంది. యోగా కోసం ప్రపంచ మానవాళి మహా సంకల్పానికి నాంది పలికిన రోజుగా విశిష్టఖ్యాతినందుకుంది. భారత ప్రధాని నరేంద్రమోడీ ఆ మహాసంకల్పానికి శ్రీకారం చుట్టి..తద్వారా భారతదేశ విఖ్యాతిని దశదిశలా మార్మోగించారు. యోగసాధన ప్రజల జీవితాల్లో ఒక భాగం కావాలనీ, అందరూ ఆరోగ్యంతో ఆనందంగా జీవనం సాగించేందుకు యోగా ఒక మంచి సాధనమనీ ఆయన ఉద్బోధించారు. అందుకు ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్పందన రావడం విశేషం. విశ్వవ్యాప్తంగా 192 దేశాల్లోని వేల నగరాల్లోని ప్రజలు ఒకేరోజున అలా యోగసాధన చేసే ఒక అపూర్వ.. అద్భుత దృశ్యానికి ప్రపంచమే ఒక వేదికగా అవతరించింది. ఈ యుగానికే యోగా ఒక మహా యోగంగా నిలిచిపోయింది. ఇందుకు ప్రధాన కారణం ప్రధాని నరేంద్రమోడీ సంకల్పబలమే. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరపాలన్న భారతదేశ తీర్మానానికి ఐక్యరాజ్య సమితి మద్దతు ఇవ్వడం, ఐరాస సభ్యదేశాలైన 177 దేశాల మద్దతు కూడా లభించడం ఒక చరిత్రాత్మక ఘట్టం. యోగా అనేది మనకు వారసత్వంగా వచ్చిన సంపద. ఇది ఏ ఒక దేశానికో, మతానికో సంబంధించినది కాదు. మన దేశంలో పుట్టిన యోగా నేడు ప్రధాని మోడీ కృషితో విశ్వవ్యాప్తం కావడం ఎంతో సంతోషదాయకం. తీవ్ర వత్తిడి నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించడమే కాకుండా ప్రేమ, శాంతి, ఐకమత్యం, సద్భావనలను ప్రపంచానికి అందించడమే ముఖ్యమని, అదే యోగా దినోత్సవం ప్రధాన లక్ష్యమని ప్రధాని పేర్కొన్నారు కూడా. అందుకే, ఐక్యరాజ్యసమితి కార్యాలయం నుంచి ఆఫ్ఘనిస్తాన్ దాకా, ప్రపంచం లోని ఎత్తయిన యుద్ధక్షేత్రంగా వున్న సియాచిన్ శిఖరం నుంచి కన్యాకుమారి తీరాల దాకా, గగనసీమల నుంచి నడిసంద్రంలో వున్న యుద్ధ నౌకల దాకా..జూన్ 21న ఎక్కడ చూసినా యోగసనాల సాధనతో, యోగా ప్రదర్శనలతో..ప్రపంచమే యోగముద్రలో వుండిపోయిందా అన్పించింది. ఇదో అపూర్వమైన రోజుగా చరిత్రలో నిలిచిపోయింది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి బాన్‌కీ మూన్ దంపతులు సైతం యోగా కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఐరాస ప్రధాన కార్యాలయంలో వారు యోగాసనాలు వేయగా, ఇక్కడ మనదేశంలో ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీలోని రాజ్‌పథ్ వద్ద పెద్దఎత్తున జరిగిన యోగా కార్యక్రమంలో ఏకంగా 21 యోగాసనాలు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు కూడా. దాదాపు 36 వేల మంది సాధకులు ఇక్కడ యోగాసనాల సాధనతో పులకించిపోయారు. ఇది రెండు గిన్నిస్ రికార్డులను కూడా సృష్టించడం మరో విశేషం. ఇంతటి అద్భుతమైన రోజు రావడం ప్రధాని నరేంద్రమోడీ కార్యదక్షతకు, ఒక మంచి కార్యక్రమాన్ని ప్రపంచప్రజలకు అందివ్వాలనే అద్భుతమైన ఆకాంక్షకూ నిదర్శనమనే చెప్పాలి. విశ్వమానవాళి శ్రేయస్సునూ, సకల జనుల శాంతినీ కాంక్షిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ హాయిగా ఆరోగ్యంతో.. ఆనందంతో జీవించాలనే సదాశయంతో నిర్వహించిన ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశ్వవ్యాప్త ఖ్యాతి రావడం ఎంతో సంతోషదాయకం. యోగా.. అనేది ప్రపంచవ్యాప్తంగా పలు తరాలు, పలు సంప్రదాయాలు అందించిన ఒక బహుమతి అనీ, ఇది అన్ని దేశాలకూ, అన్ని వర్గాలకు చెందినదనీ ప్రధాని మోడీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజలకు మేలు చేసేందుకు, ప్రేమ-శ్రేయస్సు అనే సందేశాన్ని విశ్వవ్యాప్తి చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతో తోడ్పడుతుందని ఆయన అన్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రపంచవ్యాప్తంగా ఈ కార్యక్రమం ఎంతో కన్నులపండువగా సాగి.. మరో అద్భుత ప్రపంచానికి.. శాంతియుగానికి.. యోగా యుగానికీ బాటలు వేసిందంటే అతిశయోక్తి కాదు. మనస్సు-శరీరం-ఆత్మ మధ్య సమతౌల్యాన్ని సాధించే మార్గంగా పేరొందిన భారతీయ ఆధ్యాత్మిక సాధనమైన యోగాకు నేడు ఇంతటి ఖ్యాతి చేకూరడం విశేషం. ఇంతటి బృహత్తరమైన కార్యక్రమానికి నేతృత్వం వహించిన ప్రధాని నరేంద్రమోడీకి దేశవ్యాప్తంగా ప్రజలు ఆనంద సందోహాలతో నీరాజనాలు పలికారు. దేశవ్యాప్తంగా ప్రజలు స్పందించి.. యోగా కార్యక్రమాలు నిర్వహించి ప్రధాని మోడీ సంకల్పదీక్షకు జేజేలు పలికారు. దీంతో, శాంతి సామరస్యపు నూతన శిఖరాలను అధిరోహించేలా మనసుకు శిక్షణ ఇచ్చే సరికొత్త యుగం ప్రారంభమైందని ప్రధాని ఆకాంక్షించారు. ఇంతటి విశిష్టమైన కార్యక్రమానికి ఎలాంటి తారతమ్యాలు లేకుండా మానవాళి అంతా ఒకే మాటగా.. ఒకే బాటగా స్పందించి యోగాసనాల సాధనతో పులకించిపోవడం నిజంగా ఒక అద్భుతం. ప్రపంచవ్యాప్తంగా ఇంత మంచి కార్యక్రమానికి ప్రధాని మోడీ శ్రీకారం చుట్టడం భారతదేశానికే గర్వకారణం. ఏదేమైనా.. యోగా జీవితాలను ప్రకాశమానం చేస్తుంది. మానసిక వత్తిడి నుంచి మానసిక ప్రశాంతతకు బాటలు వేస్తుంది. అలాంటి అద్భుతమైన యోగాకు ఇప్పుడు ప్రపంచవ్యాప్త ఖ్యాతి రావడమంటే.. యోగాకు మహాద్భుత యోగం సిద్ధించిందన్న మాటే. దీనితో ప్రపంచ వ్యాప్తంగా భారత్ పేరు మార్మోగిపోయింది. ఇంతకన్నా మనదేశానికి శుభయోగం ఇంకేమి కావాలి?!..

## 'యోగా'యుగం



ప్రపంచంలోనే తొలిసారిగా జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటితమైంది. ఆ రోజున యావద్భారత దేశంతో సహా ప్రపంచమంతా యోగాసనాల ప్రదర్శనలతో పులకించిపోయింది. భారత ప్రధాని నరేంద్రమోడీ ఆ మహా సంకల్పానికి శ్రీకారం చుట్టి.. భారతదేశ విఖ్యాతిని దశదిశలా మార్మోగించారు. విశ్వవ్యాప్తంగా 192 దేశాల్లోని వేలాది నగరాల్లోని ప్రజలు ఒకేరోజున యోగసాధన చేసే ఒక అద్భుత దృశ్యానికి ప్రపంచమే ఒక వేదికైంది. ఈ యుగానికే యోగా.. ఒక మహాద్భుత 'యోగం'గా నిలిచిపోయింది.

# అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

**- రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్**

మాదకద్రవ్యాలు, ఎర్రచందనం, బంగారం తదితర విలువైన వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు గట్టి చర్యలు తీసుకుంటున్నారని, అందుకు తగ్గట్టుగా ప్రజలు కూడా ఈ అక్రమ రవాణాలను నిరోధించేందుకు సహకారం అందించాలని సెంట్రల్ ఎక్సైజ్‌కు చెందిన రాష్ట్ర కస్టమ్స్ కమిషనర్ షేక్ రెహెమాన్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21న ఆయన నగరంలోని దర్గామిట్టలో వున్న పోలీసు కవాతు మైదానం సమీపంలో షోర్ గార్డ్ కస్టమ్స్ ప్రివెంటివ్ సూపరింటెండెంట్ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న నెల్లూరుజిల్లాకు విశాలమైన తీరప్రాంతం వుందని, అయితే ఈ తీరప్రాంతం ద్వారా మాదక ద్రవ్యాలు, బంగారం, ఎర్రచందనం, నకిలీ కరెన్సీ వగైరాల అక్రమ రవాణాలతో పాటు, ఉగ్రవాదుల అక్రమ చొరబాట్లకు కూడా అవకాశం వుందని, కనుక ప్రజలు అప్రమత్తంగా వుండి అలాంటి వాటిని నిరోధించేందుకు సహకరించాలని కోరారు. కేంద్ర ఎక్సైజ్ శాఖ కొత్తగా షోర్ గార్డ్ కస్టమ్స్ ప్రివెంటివ్ (ఎస్‌జిసిపి) కార్యాలయాలను ఇటీవల ప్రారంభించిందని, అక్రమ రవాణాలను అరికట్టేందుకు ప్రజల సహకారాన్ని కూడా కోరుతున్నామని ఆయన అన్నారు. ఇందుకోసం సంబంధిత అధికారులు తీరప్రాంత ప్రజలతో మమేకమై, అక్రమ రవాణా నిరోధానికి, అక్రమ చొరబాట్లను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తూ తగు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అక్రమ చొరబాట్లను, ఉగ్రవాదుల చొరబాట్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎస్‌జిసిపి కృషి చేస్తున్నారు. అక్రమ రవాణాకు సంబంధించి సరైన సమాచారం ఇచ్చిన వారికి తగు బహుమతులు కూడా ఇస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా వుంచుతామని ఆయన స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టేందుకు అందరూ సహకరించాలని ఆయన అంటూ, మన జిల్లా నుంచి సముద్రం ద్వారా ఒక్క ఎర్రచందనం దుంగ కూడా అక్రమంగా తరలిపోలేదని, ఇది కస్టమ్స్ అధికారుల పనితీరుకు నిదర్శనమని ఆయన ఈ సందర్భంగా అధికారులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సహాయ కమిషనర్ జి.గోపాలకృష్ణారావు, ఎస్‌జిసిపి నెల్లూరు సూపరింటెండెంట్ జాన్ మోజెస్‌లు పాల్గొన్నారు.

# యోగాతో ఎన్నో మంచి ఫలితాలు

**- జిల్లా ఎస్పీ గజరావుభూపాల్**

యోగ సాధన ఎంతో మంచిదని, అటు మానసిక వికాసం ఇటు శారీరకోల్లాసానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని, తద్వారా ఎన్నో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ అన్నారు. ఈ నెల 21న ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయంవారి ఆధ్వర్యంలో, నెల్లూరు వేదాయపాళెంలో వున్న ఎంవిఎస్ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, యోగాసనాల సాధన ప్రతిఒక్కరికీ అవసరమేనన్నారు. మంచి ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం యోగా సాధనతో లభిస్తుందని ఆయన అన్నారు. యోగాతో ఒనగూరే ప్రయోజనాలను అందరికీ తెలియజెప్పి వారికి యోగా పట్ల ఆసక్తికలిగే విధంగా చూడాలని సూచించారు.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఆంజనేయులు, బిజెపి నాయకుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకురాలు ప్రసన్న, రాజేశ్వరి, మణి, రాధ, అజంతా స్కూల్ కరస్పాండెంట్ టి. వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత అజంతాస్కూల్ చిన్నారులు ప్రదర్శించిన యోగ ముద్రలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

## చిన్నబోయిన చిన్న మాగుంట

మాగుంట సుబ్బరామిరెడ్డి రాజకీయంగా ఓ వెలుగు వెలిగారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆ వెలుగులోనే ప్రకాశించారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి కాంగ్రెస్‌లో మూడుసార్లు ఎంపీగా గెలిచి తెలుగుదేశంలో చేరి ఓడారు. మూడుసార్లు ఎంపీగా చేసి ఇప్పుడు దబ్బుతో వచ్చే ఎమ్మెల్సీకి పోటీ చేసి కురచపడ్డారు. కాంగ్రెస్‌లో రాజులా బ్రతికిన మాగుంట శీనయ్య ప్రాంతీయపార్టీలో చేరి స్థానిక ఎమ్మెల్సీ పదవికి పోటీ చేయడం వారికి తగినదికాదు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## అక్రమ కట్టడాలు - క్రమబద్ధీకరణ

రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.నెంబరు ఎం.ఎస్.128 ప్రకారం 30ఏళ్ళ నాటి అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టింది. దాని ప్రకారం తేది. 1.1.1985 నుండి తేది.31.12.2014 కాలంలో నిర్మింపబడిన అక్రమ కట్టడాలకు క్రమబద్ధీకరణ వర్తిస్తుంది. అయితే కొన్ని మినహాయింపులు కూడా ఇచ్చారు. మరియు తేది. 31.12.1997 ముందు నిర్మించిన భవనాలకు 25శాతం బిపియస్ జరిమానాలో తగ్గిస్తారు. ఏమైనప్పటికి నెల్లూరు నగరంలో మరియు నగర దళితవాడలతో సహా చాలామేరకు భవన నిర్మాణాలు మున్సిపల్ ప్రణాళిక వారి అనుమతి లేకుండా జరిగి ఉన్నాయి. కనుక ఆ నిర్మాణాలను కనుగొనాలంటే శాస్త్రీయమైన సర్వే అవసరం. గతంలోని బి.పి.యస్ స్కీము క్రింద కొంతమంది మాత్రమే తమ అక్రమకట్టడాలను నిబంధనల మేరకు క్రమబద్ధీకరించుకొన్నారు. చాలామంది భవన యజమానులు ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు. బహుశా అలాంటి యజమానులకు ఆ స్కీము గురించి తెలిసి వుండకపోవచ్చు లేక అలసత్వం వలన పట్టించుకోక పోయి వుండవచ్చు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ప్రణాళిక శాఖ వారు నగరమంతా పర్యటించి, ప్రణాళిక శాఖ వారిచే అనుమతి లేకుండా నిర్మింపబడిన భవనాలను గుర్తించి బిపియస్ క్రింద క్రమబద్ధీకరణకు నోటీసులు జారీ చేయాలి మరియు ప్రచారం చేయాలి.

**ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

## ప్రత్యేకకౌంటర్ పెట్టాలి




ప్రజల అవసరం నిమిత్తం తీసుకునే ఆదాయ ధృవీకరణ పత్రం కాలపరిమితి నాలుగేళ్లుగా, కుల ధృవీకరణ పత్రం విలువ జీవితకాలంగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఎమ్మార్వో ఆఫీసుల్లో పలుకుబడి లేకుండా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు రావడం లేదు. కొందరి వద్ద 1996సంవత్సరంకు ముందు ఇచ్చిన కుల, ఆదాయ, నివాస పత్రాలున్నాయి. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టరేట్‌లోనే ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

**పాలంకి నివేదిత, నెల్లూరు రూరల్.**

# గానగంధర్వునికి 'హరివరాసనం' అవార్డు



## బాలూకి కేరళ ప్రభుత్వం ప్రతిష్టాత్మక పురస్కారం



**ప్రముఖ సినీ గాయకుడు, గానగంధర్వుడు, పద్మశ్రీ శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలు)కు కేరళ ప్రభుత్వం నుంచి ఎంతో ప్రతిష్టాత్మకమైన 'హరివరాసనం' అవార్డు లభించింది. వేలాది పాటలతో, అద్భుతమైన గంధర్వ గానంతో శ్రోతలను ఉర్రూతలూగించి అశేష ప్రజానీకాన్ని సంగీత సాగరంలో ఓలలాడిస్తున్న బాలూ ఈ విశిష్టమైన అవార్డుకు ఎంపికయ్యారు.**

ఇటీవలే శబరిమలలో ఆయన 'హరివరాసనం' అవార్డుతో పాటు జ్ఞాపికను, ఘన సత్కారాన్నీ కూడా అందుకున్నారు. ఎంతో ప్రసిద్ధి చెందిన శబరిమల శ్రీ అయ్యప్పస్వామిపై ఎన్నో భక్తిగీతాలను ఆలపించిన బాలు కేరళలోనూ భక్తలోకానికంతటికీ సుపరిచితులే. తన గానమాధుర్యంతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన బాలూ.. నేటికీ, 60 ఏళ్ళ వయసులోనూ ఎంతోమంది వర్ధమాన సంగీతకారులను ప్రపంచానికి పరిచయం చేస్తూ, మరెందరో చిన్నారుల సంగీత ప్రతిభకు తగు గుర్తింపునిస్తూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూనే వున్నారు. సినీ రంగంలో వుంటూ, ప్రఖ్యాత గాయకునిగా వివిధ భాషల్లో వేలాది పాటలను గానం చేసిన బాలూ, గత అయిదు దశాబ్దాలుగా సంగీత రంగానికి నిరుపమానమైన సేవలందిస్తున్నారు. ప్రత్యేకించి శ్రీ అయ్యప్ప స్వామిపై ఆయన పలుభాషల్లో ఆలపించిన భక్తిగీతాలు ఎంతో సుప్రసిద్ధమై, భక్తలోకాన్ని మరింత భక్తిభావ సమన్వితులను చేశాయి. ప్రత్యేకించి భక్తిసంగీతంలో ఆయన తనదంటూ హృద్యమైన గానంతో మరింత విశిష్టఖ్యాతిని సంతరించుకున్న విషయం తెలిసిందే. కేరళ ప్రభుత్వం ఇటీవల శబరిమలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో, శబరిమల హైపవర్ కమిటీ ఛైర్మన్ కె. జయకుమార్, కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వి.ఎస్ శివకుమార్ తదితరుల సమక్షంలో, శబరిమలలోని శ్రీ అయ్యప్పస్వామి సన్నిధానంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు ఆయనకు లక్ష రూపాయలను బహుమతిగా కూడా అందజేశారు. రాష్ట్రస్థాయిలోనే కాక, జాతీయ స్థాయిలోనూ అనేక అవార్డులను, ఘన సత్కారాలనూ అందుకున్న బాలూ, ప్రత్యేకించి శబరిమలలోని శ్రీ అయ్యప్ప స్వామి సన్నిధిలో తనకు కలిగిన గౌరవం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ అక్కడి వారందరికీ మనసారా తన కృతజ్ఞతలు తెలిపారు. శబరిమల క్షేత్రం ఎంతో దివ్యమైన.. పవిత్రమైన పుణ్యక్షేత్రమని, తాను శ్రీ అయ్యప్పస్వామిపై ఎన్నో భక్తిగీతాలు గానం చేసివున్నప్పటికీ, ఆ స్వామిని దర్శించుకోవడం ఇదే తొలిసారి అని ఆయన అంటూ, ఇంతటి విశిష్టమైన అవార్డు తనకు లభించడం ఆ భగవంతుని కృపేనని అన్నారు. కాగా, పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు కేరళ ప్రభుత్వం నుంచి ఎంతో ప్రతిష్టాత్మకమైన 'హరివరాసనం' అవార్డు లభించడంతో ఆయన స్వస్థలమైన నెల్లూరుసీమలో సంగీతాభిమానులందరూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గానగంధర్వుడు బాలూకి నెల్లూరీయులందరూ మనసారా అభినందనలు తెలియజేశారు.

## సినారాకు రాష్ట్రస్థాయి జ్యూరీ పురస్కారం



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి చిన్ని నారాయణరావు రచించిన 'గుండె దీపం' కవితా సంపుటికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ప్రకాశం జిల్లా బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక కలేకూరి ప్రసాద్ (యువక) స్మారక సాహిత్య పురస్కారం -2015కు 150 మంది కవులు పోటీ పడగా, అందులో ఎనిమిదిమందికి జ్యూరీ అవార్డులు ప్రకటించారు. అందులో చిన్ని నారాయణరావు ప్రథములుగా నిలిచారు. త్వరలో ఒంగోలులో జరిగే కార్యక్రమంలో ఆయన ఆ మేరకు జ్యూరీ అవార్డును అందుకోనున్నారు. కాగా, ఆయన రచించిన 'మాట' కావ్యానికి ఈ ఏడాదిలోనే గుంటూరు రావి రంగారావు సాహిత్య పీఠం నిర్వహించిన జనరంజక కవి పురస్కారాల్లో కూడా చిన్ని నారాయణరావుకు బహుమతి లభించింది. ఈ సమాచారం తెలిసిన నెల్లూరులోని సాహిత్యాభిమానులు, సాహితీవేత్తలు చిన్ని నారాయణరావుకు జ్యూరీ అవార్డు లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్ని నారాయణరావుకు 'లాయర్' అభినందనలు.

## శ్రీ సిటీలో 'మెజ్జో హోల్డింగ్స్' బృందం



హాంగ్‌కాంగ్ కేంద్రంగా పలు దేశాల్లో విస్తరించివున్న ప్రముఖ మెజ్జో హోల్డింగ్స్ గ్రూప్ వ్యాపార ప్రతినిధుల బృందం మంగళవారం శ్రీసిటిని సందర్శించింది. భారత్‌లో పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు వచ్చిన వీరు తమ పర్యటనలో భాగంగా శ్రీసిటికి విచ్చేసారు. ఈ సంస్థ అంతర్జాతీయ డైరెక్టర్ రఫీక్ సిద్ధిఖీ నేతృత్వంలో ఇక్కడకు వచ్చిన 35మంది బృంద సభ్యులకు శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. ఇక్కడి మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధిని ఆయన వారికి వివరించారు. సెజ్ ప్రాంతమంతా పర్యటించిన బృంద సభ్యులు అక్కడ ఏర్పాటైన వివిధ దేశాల పరిశ్రమలు, వసతులను పరిశీలించారు. శ్రీసిటి ఎండి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ మెజ్జో పర్యటన తమకెంతో ముఖ్యమైందని, మెజ్జో గ్రూప్ తప్పకుండా శ్రీసిటిలో పెట్టుబడులు పెడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటి యాజమాన్యాన్ని మెజ్జో ప్రతినిధులు ప్రశంసించారు.


DR.BEZAWADA GOPALA REDDY WOMEN'S ACADEMY
(A Degree college for women. Affiliated to V.S University. -English Medium only)
Sri Kasturidevi Vidyalayam Campus, Dargamitta, Nellore-524 003.
Ph:0861-2326461,0861-2321270,Cell:93471 01780.



MARCH / APRIL 2015 DEGREE RESULTS

| III Bsc(MScs) | | IIIBSc(Bio-tech) | | III BCom | |
|---|---|---|---|---|---|
| Pass Percentage | 92 | Pass Percentage | 100 | Pass Percentage | 92 |
| No.of Distinctions | 9 | No.of Distinctions | 3 | No.of Distinctions | 4 |
| **II Bsc(MScs)** | | **II BSc(Bio-tech)** | | **II BCom** | |
| Pass Percentage | 90 | Pass Percentage | 90 | Pass Percentage | 91 |
| No.of Distinctions | 8 | No.of Distinctions | 5 | No.of Distinctions | 6 |
| **I BSc(MScs)** | | **I BSc(Bio-tech)** | | **I BCom** | |
| Pass Percentage | 92 | Pass Percentage | 90 | Pass Percentage | 90 |
| No.of Distinctions | 12 | No.of Distinctions | 7 | No.of Distinctions | 5 |

A NUMERO UNO :
- An Exclusive Private Women's College With an alluring ambience.
- A most sought after destination for women's education.
- An opportunity to secure merit scholarships.
- A safe place for women students.
- Training Technical & Soft Skills required by industry.
- Training for Campus Placement Mission(CPM)by JKC.
- An institution where skills latent are honed to full potential.
- A rotaract club to promote leadership dynamics.

Getting Ready to Qualify for NAAC Accreditation

COURSES OF STUDY
1. Maths - Physics - Computer Science
2. Maths - Statistics - Computer Science
3. Bio-Technology - Zoology - Chemistry
4. Bio-Technology - Chemistry - Computer Applications
5. B.Com Computer Applications

Dr. T.Subbarama Reddy Modernising SRI RABINDRANATH TAGORE AUDITORIUM

DR.B.G.R BECKONS TO A WORLD OF ACADEMIC EXCELLENCE

Secretary & correspondent SRI J.V.REDDY

YOUR DREAM DESTINATION : Sri Kasturidevi Vidyalayam Campus,Nellore-3

# నెల్లూరు కబుర్లు

## బందిల జాతర

విద్యాసంవత్సరం ప్రారంభంలోనే బందులు మొదలవుతుంటాయి. విద్యార్థుల ఫీజులు, పాఠశాలల్లో వసతుల లోపాలు వంటి సమస్యలపై విద్యార్థి సంఘాలు బందులు నిర్వహిస్తుంటాయి. ప్రతి సంవత్సరం బందులు చేయడం విద్యార్థి సంఘాలకు ఆనవాయితీ అయ్యింది. కాని వాళ్లు ఏ సమస్యల మీదైతే బందులు చేస్తుంటారో, ఆ సమస్యలు ఒక్కటంటే ఒక్కటి కూడా తీరిన దాఖలాలు లేవు. మొన్ననే 15వ తేదీ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. వారంరోజులు గడిచాయో లేదో 23వ తేదీన పాఠశాలల బంద్‌కు ఏబివిపి పిలుపునిచ్చింది. దాదాపు అన్ని పాఠశాలలు మూతపడ్డాయి. రేపోమాపో ఇంకో విద్యార్థి సంఘం కూడా బంద్ చేస్తుంది... ఆ తర్వాత వంతులవారీగా ఇంకో సంఘం... మొదటి నెల చదువులంతా ఈ బందులతోనే పోతాయి.

## కర్నూలుకు సోమిరెడ్డి



కర్నూలుజిల్లా స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి తెలుగుదేశంపార్టీ పరిశీలకులుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని నియమించారు. కర్నూలు జిల్లాలో తెలుగుదేశంకు తక్కువ ఓట్లు ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ అభ్యర్థిని దింపారు. అక్కడ టిడిపి అభ్యర్థి గెలవాలంటే వైకాపా సభ్యులను లాక్కోవాలి. సోమిరెడ్డి రాజకీయ అనుభవం అందుకు ఉపయోగపడొచ్చనే నమ్మకంతో ఆయనను కర్నూలుకు పంపిస్తున్నారు. అదీగాక కర్నూలుజిల్లాకే చెందిన డిప్యూటీ సీఎం కె.ఇ.కృష్ణమూర్తి కూడా సోమిరెడ్డి పనితీరును ఉపయోగించుకోవడానికి ప్రత్యేకంగా అక్కడకు రప్పించుకున్నట్లు తెలుస్తోంది.

### డాక్టర్ సుబ్బారావుకు

## రక్తనిధి తాళాలు

నెల్లూరుజిల్లా వైద్యవిధాన పరిషత్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.సుబ్బారావుకు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ యం.జానకి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్‌గా అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ సివి రమాదేవి వ్యవహరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ కలెక్టర్ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించారన్నారు. అనంతరం డాక్టర్ సుబ్బారావును బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది, అరుంధతీ యువజన సేవాసంఘం వ్యవస్థాపకులు చేమూరు రవికుమార్, చేమూరు మస్తాన్, కిశోర్‌బాబు తదితరులు అభినందించారు.

## సాయి సచ్చరిత్ర అఖండ పారాయణం



నెల్లూరు బాలాజీ నగర్ శివారుల్లోని పద్మావతినగర్‌లో వున్న సాయి దర్బార్ అద్దాల మందిరంలో సాయి సచ్చరిత్ర అఖండ పారాయణం కార్యక్రమం ఎంతో భక్తి శ్రద్ధలతో సాగింది. ఈ నెల 21న జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఆ సాయినాధుని దర్శించుకుని, స్వామి సచ్చరిత్రను పారాయణం చేశారు. సాయి మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు 108 మంది సాయినాధుని భక్తులు స్వామివారి సచ్చరిత్రను పఠించారు. సాయినాధుని దివ్య నామస్మరణతో మందిర ప్రాంగణం పులకించింది. నరసారెడ్డి-భారతి దంపతులు ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్వామివారి చరిత్రను పారాయణం చేసిన భక్తులకు సాయి సచ్చరిత్ర గ్రంథాన్ని బహుకరించారు. శ్రీ సాయినాధుని పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు, విశేష హారతులు నిర్వహించారు.

## వ్యాపారులను సతాయించొద్దు



వ్యాపారులపై వేధింపులు వద్దని రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి అన్నారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని దాల్ డీలర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాపారం చేస్తున్నామని, ఒక్కో మిల్లులో వెయ్యి బస్తాల వరకు నిల్వలు ఉంచవచ్చని పేర్కొన్నారు. రికార్డులు సరిగా లేవని, నిల్వలు అధికంగా వున్నాయని అధికారులు వ్యాపారులను వేధించడం దారుణమన్నారు. ఉత్పత్తి తగ్గడంతో పప్పుదినుసుల ధరలు పెరిగాయన్నారు. తనిఖీల పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తే వ్యాపారాలు బంద్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడర్స్ జనరల్ సెక్రటరీ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# తెరపైకి 'నుడా' ప్రతిపాదన

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆలోచనలకు మళ్లీ ప్రాణం వచ్చింది. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కూడా 'నుడా'పై చర్చ జరుగుతుంది. కలెక్టర్‌గా శ్రీకాంత్ ఉన్నప్పుడు దీనిపై కసరత్తు చేసారు. 33 మండలాలను కలిపి నెల్లూరు అర్బన్ డెవలప్ అథారిటీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రచించారు. ఆ సమయంలో 'నుడా' ఛైర్మెన్ పదవి కీలకంగా మారి, ఈ పదవిపై అధికార పార్టీ నాయకులు కూడా మనసు పారేసుకున్నారు.

అయితే గత కొన్ని నెలలుగా 'నుడా' విషయంలో చడీచప్పుడు లేదు. దీని ప్రస్తావన ఎక్కడా రాలేదు. కాగా ఈ నెల 22న నెల్లూరు కార్పొరేషన్ అధికారులు 'నుడా' ప్రతిపాదనలను హైలెవల్ కమిటీ ముందుంచారు. హైదరాబాద్‌లో జరిగిన హైలెవల్ కమిటీ సమావేశానికి నెల్లూరు కమిషనర్ పివివిఎస్ మూర్తి, డిప్యూటీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాసులు హాజరై 'నుడా' ప్రతిపాదనలను వివరించారు. దీంతో 'నుడా'పై మళ్ళీ కదలిక వచ్చినట్లైంది.

## జడ్పీకి ఇన్‌ఛార్జ్ సిఇఓ

జిల్లా పరిషత్ ఇన్‌ఛార్జ్ సిఇఓగా డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ సిఇఓగా వున్న జితేంద్ర 23వ తేదీ రిలీవ్ అయ్యారు. అధికారపార్టీ నేతల ఒత్తిళ్ల నేపధ్యంలో ఆయన విజయనగరం డిఆర్ఓగా బదిలీ కావడం తెలిసిందే!

## ఎస్సైల బదిలీలు

జిల్లాలో ఇటీవల ఐదుమంది ఎస్ఐల బదిలీలు జరిగాయి. విఆర్‌లో వున్న నలుగురికి పోస్టింగ్ ఇచ్చారు. వారిలో ఎస్.వెంకటరావును బాలాజీనగర్‌కు, కె.ప్రసాద్‌రెడ్డిని నెల్లూరు నాలుగోనగరానికి, బి.గోపాల్‌ను గూడూరు వన్‌టౌన్‌కు, ఎస్‌కె అబ్దుల్ రజాక్‌ను ఆత్మకూరుకు బదిలీ చేసారు. కాగా నాలుగో పట్టణ ఎస్ఐగా వున్న గిరిబాబును రాపూరుకు బదిలీ చేసారు. ఆయన నెల్లూరు నాలుగో నగరానికి వచ్చి నాలుగు నెలలే అయ్యింది. ఈలోపే ఆయన బదిలీ కావడం చర్చనీయాంశమైంది.

## క్రైమ్ సిఐపై వేటు

నెల్లూరు సిసిఎస్ సిఐ సురేష్‌కుమార్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజి సంజయ్ ఆదేశాలు జారీ చేసారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నం సిఐగా పని చేస్తూ రెండు నెలల క్రితమే సురేష్ నెల్లూరు సిసిఎస్‌కు బదిలీ అయ్యారు. ఈ ఏడాది మేలో బిట్రగుంటకు చెందిన పాత నేరస్థుడు మాధవ్‌ను సిసిఎస్ కానిస్టేబుళ్లు శిఖామణి, గిరిలు పట్టుకున్నారు. అతడిని పోలీసుస్టేషన్‌లో కాకుండా నెల్లూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉంచి విచారించారు. అతని నుండి 2.65లక్షల నగదు తీసుకుని వదిలేసారు. ఈ సంఘటనపై పత్రికల్లో వార్తలు రావడంతో జిల్లా ఎస్పీ స్పందించి విచారణ జరిపించారు. ఈ కేసులో సిఐ పాత్ర ఉన్నట్లు వారి దృష్టికి రావడంతో ఆయనను సస్పెండ్ చేసారు. అయితే ఇదే కేసులో కానిస్టేబుళ్లు శిఖామణి, గిరిలను ఛార్జిమెమోలతో సరిపెట్టారు.

## 30లోగా పన్నులు చెల్లించాలి

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇండ్ల యజమానులు 2015-16 మొదటి వాయిదాకు సంబంధించిన పన్నులను ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ పివివిఎస్ మూర్తి సోమవారం తెలిపారు. ఇంటి పన్నులు చెల్లించని వారికి డిమాండ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. 30వ తేదీలోగా పన్నులపై వడ్డీ లేకుండా చెల్లించవచ్చన్నారు. కుళాయి, డ్రైనేజీ, ఖాళీ స్థలాల పన్నులు వెంటనే చెల్లించాలన్నారు. పన్నులు చెల్లించకపోతే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆన్‌లైన్ బస్‌పాస్ కౌంటర్లు

నెల్లూరుజిల్లాలోని అన్ని ఆర్టీసి డిపోల్లో ఆన్‌లైన్ ద్వారా బస్‌పాస్‌లు ఇచ్చేందుకు కౌంటర్లు ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రబాబు తెలిపారు. సోమవారం నెల్లూరు నగరంలోని డిపో-1లో ఆన్‌లైన్ కౌంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఐదు డిపోల్లో ఆన్‌లైన్ కౌంటర్లను ప్రారంభించామన్నారు. నెల్లూరు 1, 2 డిపోతో పాటు కావలి, ఆత్మకూరు, గూడూరు డిపోల్లో ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చిందన్నారు. బస్‌పాస్‌ను సులభంగా తీసుకునేందుకు ఆన్‌లైన్ విధానం విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో-1 మేనేజర్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, ఏఐఎం పెంచలయ్య పాల్గొన్నారు.

## క్రీడలతోనే ప్రపంచ దేశాల ఐక్యత

ప్రపంచ దేశాలు ఐక్యంగా ఉండాలంటే అది క్రీడలతోనే సాధ్యమని విక్రమ సింహపురి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య వీరయ్య పేర్కొన్నారు. ప్రపంచ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులో మంగళవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఒలింపిక్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో భారీ రన్‌ను నిర్వహించారు. ఏసి సుబ్బారెడ్డి స్టేడియం నుండి ప్రారంభమైన ఈ పరుగులో క్రీడాకారులు, విద్యార్థులు, అధికారులు పలు క్రీడా సంఘాలు పాల్గొన్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విసి ఆచార్య వీరయ్య మాట్లాడుతూ ప్రపంచదేశాలన్నీ శాంతి సౌభాగ్యాలతో ఉన్నప్పుడు ప్రజలు బాగుంటారని పేర్కొన్నారు. క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకుని దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఒలింపిక్ రన్‌ను ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ భారతిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ ఏసి స్టేడియం నుండి జివిఆర్‌టి రోడ్డు, మాగుంట విగ్రహం, ఆర్టీసీ బస్టాండ్, మద్రాసు బస్టాండు మీదుగా విఆర్ కళాశాల క్రీడామైదానానికి చేరుకుంది.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు ఒలింపిక్ సంఘం కోశాధికారి పసుపులేటి రామ్మూర్తి, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట మనోహరం, పిఇటిల సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.


## వేదవ్యాసలో 'యోగా'



జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నెల్లూరు లెక్చరర్స్ కాలనీలోని వేదవ్యాస స్కూల్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. యోగ గురువు ప్రసన్న కుమార్ విద్యార్థుల చేత యోగ చేయించి దాని యొక్క ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ ఎ.పి.బాలాజీ మాట్లాడుతూ భారతదేశంలో పుట్టి పెరిగిన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రావటం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. ప్రతిఒక్కరి జీవన విధానంలో ఈ యోగా మార్పు తీసుకొని రాగలదని, మెడిటేషన్ చేయడం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యంతో పాటు విద్యార్థులు జ్ఞాపక శక్తిని పెంపొందించుకునేందుకు తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ ఎ.పి.వేదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సిఐలకు ఎస్పీ క్లాసు

జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ నగరంలోని సిఐలందరికీ క్లాసు పీకారు. 22వ తేదీ ఆయన తన క్యాంపు కార్యాలయానికి సిఐలను పిలిపించుకున్నారు. విధులను నిర్లక్ష్యం చేయొద్దు, బద్ధకాన్ని వదిలిపెట్టండి, సమస్యలపై వేగంగా స్పందించండి, పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులను గౌరవంగా చూడండి, వారి సమస్యలు వినండి, తీర్చండి, మీరు ఓపిగ్గా ఉండి సమస్యలపై దృష్టిపెడితే సగం కేసులు మీ వద్దే పరిష్కారమవుతాయని, ఏ మాత్రం మీరు తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. సిసిఎస్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డిపై సస్పెండ్ వేటు పడిన రోజే సిఐలకు ఎస్పీ క్లాసు పీకడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# రోశయ్యకు అనవసర తిప్పలు

**రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, గవర్నర్‌లకు పెద్దగా విధులుండవు. కాబట్టి వాళ్లు సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంటారు. మన గవర్నర్ నరసింహన్‌ను చూస్తున్నాం, నెలకోసారైనా తిరుమలకు వచ్చి పోతుంటాడు. తమిళనాడు గవర్నర్ రోశయ్యదీ అదే పరిస్థితి.**

రోశయ్య సుధీర్ఘకాలం రాష్ట్ర రాజకీయాలలో ఉన్నాడు. మంత్రిగా, ముఖ్యమంత్రిగా పని చేశారు. కాబట్టి ఈ రాష్ట్రంలో ఆయనకు బంధాలు, బంధుత్వాలు ఎక్కువ. ముఖ్యంగా వైశ్యులకు ఆయన ఆరాధ్య దైవం. ఆయనతో పరిచయం ఉన్నోళ్లంతా కూడా తమ ఇంట్లో ఏ వేడుక జరిగినా రోశయ్యను ఆహ్వానిస్తారు. ఆయన వస్తే అదే పదివేలుగా ఆనందపడతారు. ఇంతవరకు బాగానే వుంది కాని, వ్యాపార సంఘాలు, కార్యవర్గ సమావేశాలకు కూడా గవర్నర్ హోదాలో వున్న రోశయ్యను ఆహ్వానించడం, ఆయన రావడం కరెక్ట్ కాదు. వ్యక్తిగత హోదాలో ఆయన ఎక్కడికైనా వెళ్లొచ్చు. గవర్నర్ పదవి అత్యున్నతమైనది. మొన్న నెల్లూరులో జరిగిన బంగారం వ్యాపారుల సంఘం కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన వచ్చాడు. గవర్నర్ పాల్గొనే స్థాయి కార్యక్రమం కాదిది. ఒక గవర్నర్ పర్యటన అంటే ఆషామాషీ కాదు. ప్రభుత్వ పరంగా కూడా ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. అధికారులు ఎంతో ప్రయాసపడాలి. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఇలాంటి వ్యాపార కార్యక్రమాలకు ఎంత దూరంగా ఉంటే అంత విలువ.

# బెంగుళూరులో 'వాక్‌ఫర్ అమరావతి'



కర్నాటకలో తెలుగుదేశంపార్టీని విస్తరింపజేయాలన్న ఆ పార్టీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుకు బెంగుళూరులో వుంటున్న ఆ పార్టీ అభిమానులు బాగా స్పందిస్తున్నారు. కర్నాటకలో తెలుగుదేశం పార్టీ కో–ఆర్డినేటర్‌లలో ఒకరైన నెల్లూరీయుడు, బెంగుళూరులో వ్యాపార పరంగా స్థిరపడ్డ రావి మోహన్ చౌదరి పార్టీని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లడం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 14న బెంగళూరులో 'వాక్ ఫర్ అమరావతి' పేరుతో ఓ కార్యక్రమం పెట్టారు. మారతహళ్లి నుండి ఎంటిబి కల్యాణ మండపం వరకు 4కిలోమీటర్లు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సమావేశం నిర్వహించడమేకాక రావిమొక్కకు పూజలు జరిపించి, కావేరి జలంతో అభిషేకించారు. అక్టోబర్ 22వ తేదీ, దసరా రోజున అమరావతిలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ రావి మొక్కను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేయనున్నట్లు రావి మోహన్‌చౌదరి తెలిపారు. బెంగుళూరు టిడిపి ఫోరం అధ్యక్షులు కనకమేడల వీర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాదిమంది ఫోరమ్ సభ్యులు, నందమూరి అభిమానులు, ప్రవాసాంధ్రుల పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వంలో

# ప్రతిభకు పట్టాభిషేకం



ప్రతిభను గుర్తించడం, ప్రోత్సహించడం... ప్రతిభకు అవకాశాలు కల్పించడం ఇప్పుడు ప్రభుత్వాలు చేయాల్సిన ప్రధానమైన పని. ప్రతిభకు పెద్దపీట వేయకపోవడం వల్లే మనకంటే వెనుక స్వాతంత్ర్యం పొందిన దేశాలు కూడా అభివృద్ధిలో మన ముందు నడుస్తున్నాయి. ప్రభుత్వమే కాదు, ప్రైవేట్ సంస్థలు సైతం ప్రతిభకు ప్రాధాన్యతనివ్వాలి. ఈ పద్ధతిని పాటించడంలో వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుంది. ప్రతిఏటా ప్రతిభకు పురస్కారాలిచ్చే ఆనవాయితీని ఈ సంవత్సరం కూడా పాటించింది.

ఈనెల 20వతేదీన స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రతిభాపురస్కారాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి యం.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ యువతలో దాగివున్న తెలివితేటలను వెలికితీసి కౌశల్ భారత్‌గా తీర్చిదిద్దడమే ప్రధాని నరేంద్ర మోడీ ధ్యేయమని, ప్రపంచంలో లేని సంపద మన దేశంలో ఉందని, అది మరుగున పడిన నేపథ్యంలో వృత్తి నైపుణ్య శాఖను ఏర్పాటు చేసారని, దీనికి మంత్రిగా రాజీవ్‌ప్రతాప్ రూడీ వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ప్రతిభ కనబరచిన 87మంది విద్యార్థులకు రూ.2500, మెమెంటో, జ్ఞాపికలను స్వర్ణభారత్ ట్రస్ట్ అందజేయడం అభినందనీయమన్నారు. బివిరాజు, స్వర్ణభారత్ ట్రస్ట్ సంయుక్తంగా వృత్తి నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఈ ప్రాంత యువతకు ఉపయోగకరమని, స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికేట్లను అందజేస్తారని, వీటికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంటుందన్నారు. కేంద్రమంత్రి రాజీవ్‌ప్రతాప్ రూడీ, మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కలెక్టర్ జానకి, స్వర్ణభారత్‌ట్రస్టీ హరికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# మేకపాటికి ప్రోటోకాల్ శాపం



నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డికి ప్రోటోకాల్ శాపం ఉన్నట్లుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కాకుండా ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలోనూ ఆయనకు ప్రోటోకాల్ అవమానాలు ఎదురవుతున్నాయి. 2009లో కాంగ్రెస్ ఎంపీగా గెలిచిన మేకపాటి వై.యస్. మరణానంతరం జగన్ పెట్టిన వైసిపిలో చేరారు. అప్పుడు జిల్లాలో ఆనం సోదరులదే పెత్తనం అయ్యింది. కాంగ్రెస్‌లో వున్న ఆనం సోదరులు ప్రోటోకాల్ పరంగా మేకపాటికి ఏ మాత్రం విలువ ఇవ్వలేదు. జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన చాలా శిలాఫలకాలలో ఎంపీగా మేకపాటి పేరే కనిపించేది కాదు. దీనిపై గత ప్రభుత్వంలో వైకాపా కార్యకర్తలు ఆందోళనకు దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వంలో కూడా మేకపాటికి ఆ ప్రోటోకాల్ అవమానం తప్పలేదు. నెల్లూరులో ఏసి స్టేడియం ఎదురుగా వున్న ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌కు కృష్ణపట్నం పోర్టు వాళ్లు మరమ్మత్తులు చేసి తిరిగి వాడుకలోకి తెచ్చారు. ఈ నెల 13న మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ దానిని ప్రారంభించారు. శిలా ఫలకం మీద ఆయన స్క్రీన్ తొలగించాడు. ఆ కార్యక్రమానికి హాజరైన ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆత్రుతగా శిలాఫలకంపై తన పేరును చూసుకుందామనుకున్నాడు. కాని దానిమీద ఉంటేగా...? ఆయన ప్రాణం ఉసూరుమంది. కోట్లు ఖర్చు పెట్టుకుని ఎంపీగా గెలిస్తే, కనీసం రాళ్లు, రప్పల మీద కూడా పేర్లు వేయించుకోలేకపోతే ఎవరికైనా మండదా? పెన్నానది ఒడ్డున తిక్కన పార్కు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకంపై కూడా మేకపాటి పేరు వేయలేదు. దీంతో మేకపాటి ఈ విషయమై మంత్రిని, కలెక్టర్‌ను నిలదీసారు.

నెల్లూరు ఎంపీ ఎవరంటే మేకపాటి రాజమోహన్‌రెడ్డి అనే విషయం ప్రజలకు గుర్తుకు రాకపోవచ్చు. ఎందుకంటే ఎన్నికలప్పుడు ఒకసారి మాత్రమే ఆయనను ప్రజలు చూస్తుంటారు. అయితే ప్రోటోకాల్ ప్రకారం అన్నీ చూసుకోవాల్సిన అధికారులు కూడా నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అనే విషయం మరచిపోతే ఎలా?


BRAHMAIAH COLLEGE OF ENGINEERING
NORTH RAJUPALEM, NELLORE
బ్రహ్మయ్య కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్
Affiliated to JNT University, Anantapur and Approved by AICTE, New Delhi
ఎన్‌హెచ్-5, నార్తురాజుపాలెం, కొడవలూరు మండలం, నెల్లూరు జిల్లా
సెల్: 7207207072, 9642346686, 9963188292 ఫ్యాక్స్: 08622-215218

Courses Offered :
B.TECH
CIVIL - 60
MECH - 60
ECE - 180
EEE - 120
CSE - 60
M.TECH
M.TECH (POWER ELECTRONICS)
M.TECH (MACHINE DESIGN)
M.TECH (COMPUTER SCIENCE ENGINEERING)
M.B.A
MBA - 180
Diploma Courses
CIVIL - 60
MECH - 60

* జిల్లాలోనే ప్రప్రథమంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన గదులలో విద్యాబోధన
* అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యా బోధన
* చాప్టర్‌వైజ్‌గా జెఎన్‌టియూ తరహాలో పరీక్షల నిర్వహణ
* అత్యాధునిక వసతులతో విశాలమైన ల్యాబొరేటరీ సౌకర్యం
* 24 గంటల డిజిటల్ లైబ్రరీ సదుపాయం
* విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ సదుపాయం
* రుచికరమైన భోజనం కలిగిన మెస్ సదుపాయం
* 24 గంటలు మినరల్ వాటర్ సౌకర్యం
* జిల్లా నలుమూలల నుండి బస్సు సౌకర్యం
* అనుభవజ్ఞులైన డాక్టర్లచే వైద్య చికిత్స
* అద్భుతమైన ఉపాధి అవకాశాలు
* వైఫై ఇంటర్నెట్ సౌకర్యం
* సువిశాలమైన క్రీడా ప్రాంగణం


G.BRAHMAIAH
Chairman& President

* ఇంటర్‌లో 900 పైన మార్కులు వచ్చి, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కలిగిన విద్యార్థులకు బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 4 సం॥లు హాస్టల్‌లో ఉచిత భోజన సదుపాయం కలదు.
* హాస్టల్‌లో చేరకుండా ఇంటి వద్ద నుండి వచ్చు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
* ఎంసెట్‌లో ర్యాంకు వచ్చిన విద్యార్థులకు (ఫీజు రీఎంబర్స్‌మెంట్ అర్హత ఉన్న విద్యార్థులు) ఏవిధమైన ఫీజులు లేవు. నేరుగా వచ్చి కాలేజిలో చేరవచ్చును.
* హాస్టల్‌లో ఉండు విద్యార్థులకు సంవత్సరానికి 25000/- రూపాయలు మాత్రమే
* మొదటి సం॥ విద్యార్థులకు, బస్సు తిరుగు రూట్లలో ఎక్కడనుండైనా సం॥ రూ.6000/-లు మాత్రమే.
* మేనేజ్‌మెంట్ విద్యార్థులు నేరుగా సంప్రదించి తగిన రాయితీలు పొందవచ్చును.


Dr.K.Subrahmanyam
M.Tech., P.hd
PRINCIPAL
Brahmiah College Of Engg.

PGECET CODE : BCEN 1
EAMCET/ECET/ICET/POLYCET CODE : BCEN

# యోగముద్రలో నెల్లూరు

## - వాడవాడలా యోగాసనాల ప్రదర్శన



ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీన జిల్లానే యోగాసనాలు వేసింది. మొట్టమొదటి యోగాడేను విజయవంతంగా నిర్వహించారు. నెల్లూరు ఏసి స్టేడియంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో మంత్రి నారాయణతో పాటు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ ఎం.జానకి, అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు.

నెల్లూరులోని అనేక పాఠశాలల్లోనూ, వివిధ విద్యాసంస్థల్లోనూ ఈ నెల 21వ తేదీన యోగాసనాలను ప్రదర్శించారు. పెద్దలు, చిన్నారులు అందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనేక పాఠశాలలు, స్వచ్ఛంధ సంస్థల్లో నిర్వహించిన యోగా కార్యక్రమాలు ప్రజలందరినీ బాగా ఆకట్టుకున్నాయి. పొదలకూరురోడ్డులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలి ఆధ్వర్యంలో చిన్నారులు యోగాసనాలను ప్రదర్శించారు. యోగాతోనే ఆరోగ్యమని, ఆరోగ్యమే రాజయోగమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాటల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా, నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన యోగా దినోత్సవంలో కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు, సునీల్‌శర్మ, భాస్కరాచారి, సుధాకర్, ప్రవీణ్, రత్నరాజు, సుజాత, శైలజ, హేమలత తదితరులు పాల్గొని విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా వారు యోగా ప్రాధాన్యతను వివరించారు.

చింతారెడ్డిపాళెంలోని నారాయణ వైద్యకళాశాలలోనూ అదే రోజున యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు నారాయణరాజు మాట్లాడుతూ, యోగాభ్యాసంతో ఎంతో ఆరోగ్యంగా వుండవచ్చని, యోగాకి ప్రపంచవ్యాప్తంగా విశేషఖ్యాతిని, ప్రాముఖ్యాన్ని కల్పిస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ యోగా నేచురోపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యానంద్ మాట్లాడుతూ, యోగాసనాలు, ప్రాణాయామం వగైరాలు అభ్యసించడం వల్ల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్యసంస్థల డాక్టర్లు మహేష్, ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, నరసింహారెడ్డి, ఏజీఎం భాస్కరరెడ్డి, వనజ తదితరులు పాల్గొన్నారు.




### సాయిబాబా మందిరంలో :

నెల్లూరు ట్రంక్‌రోడ్‌లోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద వున్న సాయిబాబా మందిరంలో పతంజలి యోగా సమితి భారత స్వాభిమాన్ ట్రస్ట్, శ్రీ సత్యసాయి ధ్యానమండలి, మహర్షి భావాతీత ధ్యాన యోగా కేంద్రం తదితర సంస్థల ఆధ్వర్యంలో యోగా ప్రదర్శనలు నిర్వహించారు. అదేవిధంగా, నగరంలోని కెవిఆర్ నగరపాలక సంస్థ పాఠశాలల యోగా గురువు నరసింహశాస్త్రిచే యోగా ప్రదర్శనలు జరిగాయి. అదేవిధంగా, ఎన్జీఓ కాలనీలోని సాయిబాబా మందిరంలోనూ, నగరంలోని ఆదిత్య కళాశాలలోనూ నిర్వహించిన యోగా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# నెల్లూరు, సంగం బ్యారేజీ పనులు పూర్తి చేస్తాం

## - మరో 2 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తాం : మంత్రి నారాయణ



జిల్లాలో సాగునీటికి ఎంతో అవసరమైన సంగం, నెల్లూరు బ్యారేజీల పనులను త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. ఈ నెల 21న చింతారెడ్డిపాళెంలో వున్న నారాయణ ఆసుపత్రిలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాలో సాగునీటి వనరులను పరిరక్షించేందుకు, రైతన్నలకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో 8.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందజేశామని, ఈ సారి అదనంగా మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. సంగం బ్యారేజీ పనులకు సంబంధించి డిజైన్‌ను సరి చేశామని, వెడల్పులో మార్పులు చేసి 1195 మీటర్ల మేర పనులు చేపట్టనున్నామని తెలిపారు. అదేవిధంగా, తెలుగు గంగ బ్రాంచ్ కాలువలకు సంబంధించి అటవీశాఖ క్లియరెన్స్‌లు కూడా లభించాయని, అక్టోబర్ నెలాఖరునాటికి పనులన్నీ పూర్తి చేసి, అన్నదాతలకు కొదవ లేకుండా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే సూళ్లూరుపేట, గూడూరు, కావలి తదితర ప్రాంతాల రైతులకు కూడా సాగునీటిని పుష్కలంగా అందించేందుకు వీలుంటుందని చెప్పారు. తొలుత ఆయన జిల్లాలోని పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, జిల్లా పరిస్థితులను సమీక్షించారు.

ఈ సమావేశంలో మంత్రితోపాటు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యేలు బల్లి దుర్గాప్రసాద్, పరసా రత్నం, నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కన్నబాబు, రాధా, జ్యోత్స్నలత తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు



# పాలకుల నిర్లక్ష్యంలో ఫ్లైఓవర్

*దశాబ్దాల గూడూరు పట్టణ ప్రజల కల నెరవేరినట్టే నెరవేరి పాలకుల నిర్దయతో ప్రస్తుతానికి పడక ఎక్కింది. గూడూరు ఒకటవ రెండవ పట్టణాలను కలుపుతూ నిర్మించ తలపెట్టిన గూడూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రాజెక్ట్ గత సంవత్సరకాలంగా పెండింగులో పడింది.*

ఇక్కడ గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన పనబాక కృష్ణయ్య తమ శక్తియుక్తులన్నీ ఉపయోగించి కేంద్రమంత్రిగా వున్న తన భార్య పనబాక లక్ష్మీ సహకారంతో ఈ ఫ్లైఓవర్‌కు నిధులు సాధించగా, ఇప్పుడు ఆ పనులు పూర్తి కాకుండానే కాలదోషం పట్టింది. కోట్లాదిరూపాయలు ప్రజాధనం ఉపయోగించి సగం పనులకే పరిమితమైన ఈ ఫ్లైఓవర్ ఎప్పుడు పూర్తవుతుందో తెలియని దుస్థితి నెలకొంది. పనులు ప్రారంభమైనప్పుడు శరవేగంతో సాగినప్పటికీ ఇప్పుడు నిధుల కొరత, రెండవ స్పాన్‌కు భూసేకరణ సమస్యగా ఉన్నాయి. కాంగ్రెస్ హయాంలో మంజూరైన ఈ ఫ్లైఓవర్ పూర్తి చేసే బాధ్యతను అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు కాంగ్రెసేతర పార్టీలకు చెందినవారు కావడంతో చూసీచూడనట్టు వున్నారు. ఫ్లైఓవర్ పూర్తయితే ఆ ఖ్యాతి కాంగ్రెస్‌కు సంక్రమిస్తుందని ఆలోచనతో ప్రజాప్రతినిధులు మౌనం దాల్చినట్లు ప్రజలు అంటున్నారు. అదీకాకుండా రాష్ట్రంలో తెలుగుదేశం, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగా ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ ఎన్నిక కాలేదు.

అయితే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్న ప్రాంతం గూడూరు మున్సిపాలిటీలో కాకుండా రైల్వే పరిధిలో వుంది. దీంతో ఇక్కడ రైల్వే గేట్లు గంటల తరబడి తీయడం లేదు. మరమ్మత్తులకు గురికావడం జరుగుతుంది. దానివల్ల వాహనచోదకులు చాలా అవస్థలు పడుతున్నారు. దానికితోడు రైళ్ల రాకపోకల రద్దీ ఎక్కువకావడం కూడా జరుగుతుంది. మున్సిపల్ ఛైర్మెన్ స్థానికురాలు అయినందువలన తమవంతు కృషి చేయాలని, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఫ్లైఓవర్ బ్రిడ్జి పని పూర్తి చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# వసతి గృహాల్లో సమస్యలు వెల్లువ

## ➤ అపరిశుభ్రంగా భోజనశాలలు ➤ నీటి కొరతతో అవస్థలు

గూడూరు పట్టణంలోని వసతిగృహాల్లో కొనేళ్లుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఈ నెల 15 నుంచి పాఠశాలలు తెరుచుకోవడంతో వసతిగృహాలు కూడా అదేరోజు ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఎస్సీ, ఎస్టీ, బిసి వసతి గృహాలు తొమ్మిది ఉన్నాయి. వీటిలో ఏడు పాఠశాలకు చెందినవి కాగా మరో రెండు కళాశాలల విద్యార్థులవి. కళాశాల, ఎస్సీ వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతావి సొంత భవనాల్లోనే ఉన్నాయి. వీటిలో ప్రధానంగా మరుగుదొడ్ల అధ్వాన్నంగా ఉన్నాయి. కనీసవసతులు లేవు. కొళాయిల్లేవు, మంచినీరు రావడం లేదు. భోజన శాలలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. భవనాల చుట్టూ చెత్త నిండిపోయింది. శ్లాబు పెచ్చులూడి విద్యార్థులపై పడుతుంది. నీటి సమస్య తీవ్రంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు.

# రాజధానికి నేను సైతం...



పిట్ట కొంచం..కూత ఘనం అన్నట్లు అతి చిన్న వయస్సులో అమరావతిలో నిర్మించనున్న రాజధాని కోసం తనవంతు సాయంగా తిరుపతి నుండి తుళ్ళూరు వరకు స్కేటింగ్‌చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి తను హుండీలో దాచుకున్న రూ.20వేలను అందజేసి ముఖ్యమంత్రి ప్రశంసలందుకుంది ఆకుల ఏషా. తిరుపతికి చెందిన సతీష్‌కుమార్ – అశ్వినిల కుమార్తె ఏషా. తిరుపతిలోని భారతీయ విద్యాభవన్‌లో చదువుతున్న ఏషా చిన్నతనం నుండే స్కేటింగ్‌లో ఎన్నో గోల్డ్ మెడల్స్ సాధించింది, రాష్ట్ర, జాతీయస్థాయిలో తన ప్రతిభను చాటుకుంది. రాజధాని నిర్మాణానికి తనవంతు సాయం అందజేయాలన్న ఉద్దేశ్యంతో తల్లిదండ్రులు, సహాయకుడు లోహిత్ రెడ్డి, కోచ్‌ల సహాయంతో తిరుపతిలో జూన్ 2న టిటిడి బోర్డ్ ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి ఏషా స్కేటింగ్‌ను ప్రారంభించగా, 6వ తేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి తన హుండీని అందించి ఏపిని సింగపూర్‌లా మార్చాలని, హైదరాబాద్‌ని లాక్కున్నట్లు మన ఏపిని ఎవరు లాక్కోకుండా కాపాడాలని తన మనసులోని మాటను చెప్పి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు అందుకుంది ఏషా. సింహపురికి గర్వకారణమైన మల్లి మస్తాన్ బాబు ప్రేరణతో ఎండ, వానను లెక్క చేయకుండా తాను స్కేటింగ్ చేస్తూ ముఖ్యమంత్రిని కలిసానని ఈ సందర్భంగా ఏషా తెలిపింది.

# 'యోగా డే' భగ్నానికి కాంగ్రెస్ కుట్ర

గల్పిక

అది న్యూఢిల్లీలోని టెన్‌జనపథ్. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, యువరాజు రాహుల్‌గాంధీ, మన్మోహన్‌సింగ్, ఏ.కె.ఆంటోని, చిదంబరం, గులాంనబీ ఆజాద్, అంబికా సోని, అహ్మద్ పటేల్, మనీష్ తివారి, దిగ్విజయ్‌సింగ్ వంటి నాయకులంతా సమావేశమై వున్నారు. పక్కరోజు జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనాలా? వద్దా అనే అంశంపై చర్చిస్తున్నారు. సోనియాగాంధీ మాట్లాడుతూ... ప్రపంచమంతా యోగా దినోత్సవాన్ని పాటిస్తుంటే మనం పాల్గొనకపోతే బాగుండదేమో ఒక్కసారి ఆలోచించండి అని అంది. దిగ్విజయ్‌సింగ్ కోపంగా... ఏంటి మేడమ్, ప్రపంచమంతా పాటిస్తే మనం పాటించాలా? ప్రపంచానికి విరుద్ధంగా పోయేది ఒక్క కాంగ్రెస్‌పార్టీయే! ఇండియాలో పుట్టిన మాకు లేని దురద యోగాపై మీకెందుకు అని అన్నాడు. గులాంనబీ ఆజాద్ అందుకుని మన దేశం ప్రవేశపెట్టిన యోగాడేను మనమే వ్యతిరేకిస్తే బాగుండదేమో, అయినా ఏ కారణం చెప్పి మనం ఇందులో పాల్గొనకుండా ఉండగలమని ప్రశ్నించాడు. అప్పుడు దిగ్విజయ్ ఒక్క నిముషం ఆలోచనలో పడ్డాడు. వెంటనే ఆయన మెదడులో విషపు మెరుపు మెరిసింది. ఆనందంగా ముఖంపెట్టి... మీకీ విషయం తెలీదా, యోగా హిందూ మత కార్యక్రమం. యోగా చేసేటప్పుడు సూర్యనమస్కారాలుంటాయి. 'ఓం' అని మంత్రం పఠించాలి. ఇది ముస్లింలకు వ్యతిరేకం. ముస్లింలెవరూ దీనిలో పాల్గొనకూడదు. మనకు ఇది మంచి అవకాశం. యోగాకు వ్యతిరేకంగా ముస్లింలను రెచ్చగొడదాం, ఓట్లు కొల్లగొడదాం అని చెప్పాడు. అప్పుడు గులాంనబీ ఆజాద్ మనసులో... మాకులేని దుర్మార్గపు ఆలోచనలు నీకే వచ్చాయనుకున్నాడు. వెంటనే రాహుల్ కూడా... అవును మమ్మీ మనం యోగాడేను వ్యతిరేకిద్దాం. అదే సమయంలో అదేరోజు మ్యూజిక్‌డే. మన పార్టీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా వెస్టన్ మ్యూజిక్ ప్రోగ్రామ్‌లను అరేంజ్ చేద్దాం. యువతను బాగా అట్రాక్ట్ చేయొచ్చు. అలాగే పార్టీ తరపున వాలెంటైన్స్‌డే, డ్యాన్స్ డే, అల్కహాల్‌డే, స్మోకింగ్‌డే, ఎంజాయ్‌డే వంటి వాటిని ప్రతిపాదించి పెట్టిద్దాం. వీటికి జనం ఎక్కువుగా ఆకర్షితులవుతారు. వాళ్లందర్నీ ఓటు బ్యాంకుగా మలచుకోవచ్చని చెప్పాడు. రాహుల్ తెలివితేటలకు సోనియాగాంధీ మురిసిపోయింది. ఇప్పుడిప్పుడే నువ్వు కాంగ్రెస్ రూట్‌లోకి వస్తున్నావంటూ రాహుల్‌ను మెచ్చుకుని, అలాగైతే రేపు 'యోగాడే'ను ఫెయిల్ చేస్తేనే మనం ప్రపోజ్ చేసే డేస్‌ను సక్సెస్ చేసుకోగలం. రేపు 'యోగాడే' సక్సెస్ అయితే ఆ క్రెడిట్ అంతా నరేంద్ర మోడీకి పోతుంది. యోగాడేను ఫెయిల్ చేయడం ఎలా అని సోనియా ప్రశ్నించింది. ఆ పని మేం చూసుకుంటామని దిగ్విజయ్‌సింగ్ హామీ ఇచ్చాడు. దీంతో అందరూ అక్కడనుండి వెళ్లిపోయారు.

★★★★★

జూలై 21వ తేదీ. న్యూఢిల్లీలోని రాజ్‌పథ్. నేలపై కొన్ని వేల చాపలు పరిచి వున్నారు. దాదాపు 35వేల మంది యోగా చేయడానికి సన్నిద్ధమై ఆ చాపలపై నించున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వేదికపై నుండి యోగా విశిష్టతను గురించి ఉపన్యసిస్తూ, 'యోగా' గురించి మనకు తెలుసని, రోగం, భోగం కాంగ్రెస్ ఆస్థి అని కాబట్టే వాళ్లు యోగాలో పాల్గొనలేదని చురకంటించారు. తర్వాత ఆయన వేదిక దిగి ఒక చాపపై కూర్చున్నారు. అక్కడున్న 35వేల మంది ధ్యానం చేస్తున్న పొజిషన్‌లో కూర్చుని కళ్లు మూసుకున్నారు. అందరూ ధ్యానం చేయసాగారు. రాజ్‌పథ్‌లో జరిగే యోగాడేను భగ్నం చేయడానికి అక్కడే చెట్లచాటున నక్కివున్న దిగ్విజయ్‌సింగ్, మనీష్ తివారి, రాహుల్‌గాంధీ, చిదంబరం, అహ్మద్‌పటేల్ ఇదే అదనుగా బయటకొచ్చారు. వారి వెంట ముమైత్‌ఖాన్ కూడా వుంది. దిగ్విజయ్‌సింగ్ తన వెంట తెచ్చుకున్న టేప్‌రికార్డర్‌లో క్యాసెట్ పెట్టి ఆన్ చేసాడు. 'పోకిరి' సినిమాలోని "ఇప్పటికింకా నా వయస్సు నిండా పదహారే... చీటికిమాటికి చెయ్యేస్తూ చుట్టూ కుర్రాళ్లే" అనే పాట రాసాగింది. రాహుల్, దిగ్విజయ్, మిగతావాళ్లు ఈలలు వేస్తూ, చప్పట్లు కొడుతూ, డ్యాన్స్‌లేస్తూ రచ్చ చేస్తున్నారు. ముమైత్‌ఖాన్ డ్యాన్స్ చేస్తుంటే చూడడానికి యోగాలో వున్న వాళ్లంతా లేచొస్తారని దిగ్విజయ్‌ప్లాన్. కాని 35వేల మందిలో ఒక్కరంటే ఒక్కరు కూడా కన్ను తెరిచి ముమైత్‌ఖాన్ వంక చూడలేదు. అందరు కూడా ఒక దానివెంట ఒకటి యోగాసనాలు వేస్తున్నారు. ముమైత్‌ఖాన్‌తో లాభం లేదనుకున్న దిగ్విజయ్‌సింగ్ వెంటనే సోనాక్షి సిన్హాను దించాడు. ఒక ఐటమ్ సాంగ్ పెట్టాడు. అయినా ఎవరూ చలించలేదు. ఆ తర్వాత కాజల్, అనుష్క, ప్రియాంకచోప్రా, విద్యాబాలన్‌ల చేత ఐటంసాంగ్స్ వేయించాడు. అయినా ఎవరూ కదల్లేదు. కనీసం ఒక్కరు కూడా కళ్లు వీళ్ల వైపు తిప్పలేదు. దాంతో దిగ్విజయ్ గుండెల్లో రాయి పడింది. యోగాడేను ఫెయిల్ చేస్తానని సోనియా ముందు బిల్డప్ ఇచ్చాను. కాని ఇక్కడ చూస్తే టాలీవుడ్, బాలీవుడ్ హీరోయిన్లందరినీ తీసుకొచ్చినా ఒక్కరూ లేవడం లేదు, ఏం చేయాలబ్బా అని ఆలోచిస్తుండగా, ఆయన కళ్ల ముందు స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64+) మెదిలాడు. ఈ టైంలో ఇతనే కరెక్ట్ అనుకుంటూ వెంటనే వివేకాకు ఫోన్ చేసాడు. వివేకా ఫోన్ ఎత్తాడు. దిగ్విజయ్ ఫోన్‌లోనే సమస్యని వివరించి ఎలాగైనా 'యోగాడే'ను భగ్నం చేయాలన్నాడు. దానికి వివేకా... మీరేం వర్రీ కాకండి, ఇప్పుడే రేణిగుంట నుండి స్పెషల్ ఫ్లైట్‌లో ఒక టన్ను నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలను పంపుతాను, వాటిని అక్కడ యోగా చేస్తున్న వాళ్ల మీద వదలండి, వాటి కాటుకు అక్కడున్న మనుషులే కాదు, చెట్లూ, రాళ్లు కూడా పరుగులు తీయాల్సిందేనని చెప్పాడు. దాంతో దిగ్విజయ్‌సింగ్‌కు ప్రాణం లేచొచ్చినట్లయ్యింది. కొద్దిసేపటికి నెల్లూరుదోమలు ఢిల్లీకి చేరుకున్నాయి. రాజ్‌పథ్ వద్ద దోమల బస్తాల మూతలు విప్పారు. అప్పటిదాకా బంధించివున్న దోమలు రక్తపిశాచాల్లాగా యోగా చేస్తున్నవారిపై దాడికి దిగాయి. యోగా చేస్తున్నవారిని విచక్షణా రహితంగా కుట్టసాగాయి. అయినా ఒక్కరు కూడా కదల్లేదు. ఆ దృశ్యం చూసి దిగ్విజయ్ చలించిపోయాడు. 'యోగా'కు ఇంత శక్తి ఉందా అనుకున్నాడు. అప్పుడే యోగా ముగిసింది. నరేంద్ర మోడీ కళ్లు తెరిచాడు. దిగ్విజయ్ పరుగెత్తుకుంటూ వెళ్లి నరేంద్రమోడీ చేతులు పట్టుకుని... నన్ను క్షమించండి, నేను మీ యోగాను భగ్నం చేయాలనుకున్నాను, కాని మీరు చలించకుండా యోగా శక్తిని చాటారన్నాడు. అందుకు మోడీ... పిచ్చోడా మీరు చేసేదంతా నా మనోనేత్రంతో చూస్తూనే వున్నా... తెలుగు, హిందీ సినిమా యాక్టర్లనే కాదు, హాలీవుడ్ భామలను తీసుకొచ్చినా చలించని గుణం యోగాలో వుంది. నన్ను చూస్తే అర్థం కాలేదా? ఇక నువ్వు ప్రయోగించిన నెల్లూరు దోమలు మా రక్తాన్ని లీటర్ల కొద్దీ తాగాయి. అయినా మాకు ఏ నొప్పీ కలగలేదు. ప్రపంచంలో నెల్లూరు ముదురుదోమల కాటును తట్టుకునే శక్తి ఒక్క యోగా సాధన ద్వారానే లభిస్తుందని చెప్పి అక్కడనుండి బయల్దేరాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

బ్యాంకు వ్యవహారాలు చెల్లింపులలో జాగ్రత్త అవసరం. ఉద్యోగులు అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. వ్యాపారాలలోను, ఉద్యోగాల లోను ఆటంకాలను అధిగమిస్తారు. ఆరోగ్యపరంగా జాగ్రత్త తీసుకొనండి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి. కొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారులకు అవకాశం ఉంటుంది. విద్యార్థులు పోటీ పరీక్షలకై గట్టి కృషి చేస్తారు. ఆర్థికంగా మంచి అవకాశాలు రావడం, రాబడి పెరగడం ఉంటుంది. బిడ్డల వల్ల స్వల్పంగా ఇబ్బందులు పడతారు. అనుకున్న సొంత పనులు సవ్యంగానే జరుగుతాయి. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తిపరంగా పెరుగుదల బాగుంటుంది. విలాస వస్తువులు, విలువైన వస్తువులు కొంటారు. అవసరాలకు స్వల్పంగా ఋణం చేస్తారు. వారం మధ్యలో పనులకు ఆటంకాలుంటాయి. వ్యాపారవర్గాలకు అవకాశాలు ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. సంప్రదింపులు, అగ్రిమెంట్లకు అనుకూల సమయము. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు దొరుకుతాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయం పెరుగుతుంది. వ్యాపారాలలో ఇతరులతో కొద్దిపాటి చికాకులుంటాయి. ఆహ్వానాలు, కీలకపాత్రలు, పన్ను నోటీసులు అందుకుంటారు. ప్రయత్న పూర్వకంగా అవకాశాలు లభించి ఆర్థికస్థితిని మెరుగుపరచుకుంటారు. విద్యార్థులు పోటీ పరీక్షలందు శ్రద్ధ చూపుతారు. ఆర్థిక వ్యవహారాలు సమర్థవంతంగా నడుపుతారు. ప్రభుత్వ అనుమతులు, ఋణాలు లభించగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

సమస్యలు క్రమంగా సర్దుబాటు కాగలవు. అనుకున్న పనులను ఏదో ఒక విధంగా జరుపుకొంటారు. బిడ్డల వల్ల చిన్న ఇబ్బందులుంటాయి. ఆదాయ వ్యయాలు అంచనాలకు మించుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలుండి ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. పోటీ పరీక్షలకు విద్యార్థులు శ్రద్ధ చూపుతారు. ఆరోగ్యం ఫరవాలేదు. స్టాకిస్టులు ఇబ్బందులు పడతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ అనుమతులలో జాప్యం ఉంటుంది. ఉద్యోగులకు వ్యాపారులకు అధికారుల వల్ల ఇబ్బందులుంటాయి. మీ నిర్ణయాలు, పనులు మంచి ఫలితాలనిస్తాయి. ఉద్యోగులకు పనిభారం ఎక్కువ మరియు అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. ముఖ్య పనులు హడావిడిగా చేస్తారు. నిరుద్యోగులు వేచి వుండవలసి ఉంటుంది. కోర్టు కేసులు వాయిదాపడతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 26.06.2015 నుండి
తేది. 02.07.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, వృషభంలో బుధుడు, మిధునంలో రవికుజులు, కర్కాటకంలో గురుశుక్రులు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, తుల వృశ్చిక ధను రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
ముహూర్తములు లేవు

**అధికాషాఢమాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 26 | శుక్ర | దశమి | పూర్తిగ |
| తేది. 27 | శని | దశమి | ఉ॥ గం.6.54వ॥ |
| తేది. 28 | ఆది | ఏకాదశి | ఉ॥గం.8.5వ॥ |
| తేది. 29 | సోమ | ద్వాదశి | ఉ॥గం.8.50వ॥ |
| తేది. 30 | మంగళ | త్రయోదశి | ఉ॥గం.9.02వ॥ |
| తేది. 01 | బుధ | చతుర్దశి | ఉ॥గం.8.46వ॥ |
| తేది. 02 | గురు | పూర్ణిమ | ఉ॥గం.7.58వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రభుత్వ అనుమతులు లభించడం, ఋణాలు బ్యాంకుల నుండి లభించడం జరుగుతుంది. శరీరానికి గాయాలు తగలవచ్చును. వ్యాపారవర్గాల వారు ఆర్థిక సమస్యలను ఎదుర్కొనవలసి ఉంటుంది. ఆదాయం సామాన్యం. వృత్తి జీవనం కలవారు రాణిస్తారు. ఉమ్మడి వ్యాపారాలు, లీజులు, ఏజన్సీలు లభించవచ్చును. కోర్టు కేసులకు పొడిగింపు ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వస్తు వాహన గృహ రిపేర్లుంటాయి. నిర్మాణాలందు, పరిశ్రమలందు యమానులకు వర్కర్ల వల్ల సమస్యలు కలుగవచ్చును. చేసే పనులు, సొంత వ్యవహారాలలో ఇబ్బందులు కలుగుతాయి. ప్రభుత్వ అనుమతులు, పనులు, ఆలస్యం కాగలవు. కొత్త పరిచయాలుంటాయి. ఖర్చులు పెరిగినా భారమనిపించవు. అవసరాలకు డబ్బు అందుతుంది. భూవివాదాలు పరిష్కారానికి రాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సంప్రదింపులలో ప్రముఖపాత్ర వహిస్తారు. రావలసిన బాకీలు కొంత లభిస్తాయి. ఉద్యోగులు అధికారులతో సత్సంబంధాలు నెలకొల్పుకొంటారు. కార్యసామర్థ్యం బాగుంటుంది. అందరినీ మెప్పించి అనుకూలంగా మలుచుకొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరులకు సహాయపడడం చేస్తారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఋణ యత్నాలు ఫలించడం, రావలసిన బాకీలందు అనుకూలత బాగుంటుంది. అనుకున్న పనులకు ఆటంకాలు ఎదురైె సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. అవకాశాలు ఆర్థికంగా బాగుంటాయి. మీ మాటకు గుర్తింపు బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరకగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సోదరుల కుటుంబాలకు మేలు జరుగుతుంది. దూర ప్రయాణాలుంటాయి. కుటుంబవ్యక్తుల వల్ల చిన్న సమస్యలుండినా సర్దుబాటు చేస్తారు. వ్యాపార, వృత్తి జీవనం కలవారికి ఆర్థికావకాశాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలను నిర్ణయం చేస్తారు. ఆత్మీయుల నుండి శుభవార్తలు వింటారు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శుభకార్యాలలో పాల్గొంటారు. దూర ప్రయాణాలుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు లభించడం ఉంటుంది. మీ నిర్ణయాలు మంచి ఫలితాన్నిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి మంచి అవకాశాలు దొరుకుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికావకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. విలువైన వస్తువులను కొనడం జరుగుతుంది.

# నారాయణా చీకటి పర్యటనలు మానుకో!

**- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి**



జిల్లా మంత్రి పొంగూరు నారాయణ చీకటి పర్యటనలు మానుకొని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని భారతీయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలో నమస్కార్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో లక్షలాదిమంది ప్రజల ఆహారభద్రతపై జిల్లా అధికారులు గాని, మంత్రి నారాయణ గాని పట్టించుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతుండడంతో సామాన్యులు సరుకులను కొనుగోలు చేసే పరిస్థితులు లేకుండా పోయాయన్నారు. బడా వ్యాపారస్తులు అక్రమంగా నిత్యావసర సరుకులను నిల్వ ఉంచడమే దీనికి కారణమన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పూర్తిగా అస్థవ్యస్తంగా మారిందని, పౌరసరఫరాల అధికారులు బాధ్యతలను విస్మరించి మామూళ్ల మత్తులో ఉన్నారన్నారు. జిల్లా మంత్రి రాత్రిళ్లు సమీక్షలు, సమావేశాలు నిర్వహించటం తప్ప జిల్లాకు మేలు చేసిందేమీ లేదన్నారు. మున్సిపాలిటీలో అన్ని ఆహారపదార్థాలు కల్తీ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులుకు గురౌతున్నారన్నారు. పురపాలక సంఘంలో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకుల ద్వారా కోట్లు వెచ్చించి త్రాగునీరు సరఫరా చేస్తున్నా ఆ నీరు కలుషితంగా మారడంతో ప్రజలు ఆ నీటిని త్రాగడం లేదన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంటులు విరివిగా వెలుస్తున్నా, వాటిని తనిఖీలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్న సందర్భాలు లేవన్నారు. నీరు-చెట్టు కార్యక్రమంలో కోట్ల రూపాయలు దోపిడీకి గురౌతుందని, చెరువులు బాగు చేసేందుకు కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన వేలకోట్ల రూపాయలను తప్పుదోవ పట్టిస్తున్న అధికారులు జైలుకు పోక తప్పదన్నారు. రాజకీయ నాయకులు చేసే పనులను పరిశీలించి సంతకాలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వి.వి.రంగారెడ్డి, ప్రధానకార్యదర్శి రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు చలువాది సత్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు నంబూరు శ్రీనివాసులురెడ్డి, మహిళా నాయకురాలు పూనూరు మాధవి పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

## ఉత్సవ విగ్రహ చోరీకి యత్నం

అల్లూరుపేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవి ఉత్సవ విగ్రహాన్ని ఎత్తుకెళ్లేందుకు ఓ వ్యక్తి విఫలయత్నం చేశాడు. స్థానికంగా వుండే మునిస్వామి సాయంత్రం ఆలయంలోకి వెళ్లి అర్చకుడు దీపాలను వెలిగించే సమయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రహరీగోడ అవతల పెట్టాడు. అతని కదలికలపై అనుమానం వచ్చిన భక్తులు దేవాలయం వెనుకకు వెళ్లి చూడగా అక్కడ విగ్రహాన్ని ఆకులతో కప్పి పెట్టి ఉండడాన్ని గమనించారు. అర్చకుడు వెంటనే ఆ విగ్రహాన్ని లోపలకు తీసుకువచ్చి భద్రపరిచాడు. అల్లూరు పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## దొంగల ముఠా అరెస్ట్



కొండాపురం మండలంలో బంగారం దొంగతనం చేసే ముఠాకు చెందిన నాగులూరి తిరుపతి, నాగులూరి చినరోశయ్య, నాగులూరి రవీంద్ర, నాగులూరి వెంకటేశ్వర్లు అనే నిందితులను అరెస్ట్ చేసినట్లు కావలి డిఎస్పీ రాఘవరావు తెలిపారు. ఈ నెల 24వ తేదీ కావలి రూరల్ సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాలలో నిద్రిస్తున్న మహిళల మెడల్లో బంగారు గొలుసులు దొంగలించడం, పథకం ప్రకారం ఇళ్ల దొంగతనాలకు పాల్పడడం వీళ్లు చేస్తుంటారని అన్నారు. జిల్లాలో బుచ్చి, ఏఎస్‌పేట, సంగం, దక్కిలి మండలాలలో వీళ్లు దొంగతనాలకు పాల్పడ్డట్లు చెప్పారు. ఈ దొంగల్లో కొండాపురం మండలం ఎర్రబెల్లి గ్రామంలో దొంగతనానికి వచ్చిన సమయంలో నాగులూరు తిరుపతిని గేదె పొడవగా గాయాలయ్యాయని, అతనిని కావలి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్యం కూడా అందించామన్నారు. ఈ దొంగలను అదుపులోకి తీసుకుని 6లక్షల విలువచేసే 22.5 సవర్ల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయమేది?

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని మున్సిపల్ ఇన్‌ఛార్జ్ ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ కోరారు. ఈ నెల 23వ తేదీన కావలిలోని మన్నెం గోపాలకృష్ణారెడ్డి కల్యాణ మండపం నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు అగ్రిగోల్డ్ కస్టమర్స్ మరియు ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో పాల్గొన్న భరత్‌కుమార్ మాట్లాడుతూ కూలీలు, పేదలు రూపాయి రూపాయి కూడబెట్టి అగ్రిగోల్డ్ సంస్థలో దాచుకున్నారని, సంస్థ వారి డిపాజిట్లను తిరిగి చెల్లించకుండా వారి కడుపుకొట్టడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వివి రంగారెడ్డి, రమణయ్య, వైసీపీ నాయకులు పి.కామరాజు, కనమర్లపూడి వెంకటనారాయణ, సిపిఐ నాయకులు దామా అంకయ్య, వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు టి.మాల్యాద్రి, వి.పెంచలయ్య, వస్త్రవ్యాపార సంఘం నాయకులు తన్నీరు మాల్యాద్రి, ద్రోణాదుల వెంకట్రావు, అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సిహెచ్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

---



**• స్వచ్ఛభారత్ స్ఫూర్తితో**

**గ్రామీణ వికాసమే పరమావధిగా...**

# పల్లె ప్రజల సేవలో విడవలూరు వాసి..రవిరెడ్డి


భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన 'స్వచ్ఛభారత్' నినాదం గ్రామీణ వికాసం కోసం పరితపించే వారిలో మరింత తపన రేకెత్తించింది. సంపూర్ణ పారిశుద్ధ్యం కోసం కేంద్రప్రభుత్వం చేస్తున్న కృషితో పాటు, పలు స్వచ్ఛంధ సంస్థలు కూడా అందుకు నడుం బిగించాయి. అందులో 'రీడ్స్' (రూరల్ ఎకనమిక్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ) ఒకటి. వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్‌గా వుంటూ, దాదాపు మూడు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో స్థిరపడి ఎన్నో వ్యాపార సంస్థలకు, పరిశ్రమలకు సలహాదారుగా, ఆడిటర్‌గా పనిచేస్తున్న సోమవరపు రవికుమార్‌రెడ్డి ఈ సంస్థను నిర్వహిస్తున్నాడు.

1958 మార్చి 10న నెల్లూరుజిల్లాలోని విడవలూరు గ్రామంలో శ్రీమతి ఇందిరమ్మ-కృష్ణారెడ్డి దంపతులకు జన్మించిన రవికుమార్‌రెడ్డి, తాను పుట్టి పెరిగిన గ్రామీణ పరిస్థితులను మరచిపోకుండా, 'రీడ్స్' స్వచ్ఛంధసంస్థ ద్వారా గ్రామీణ సమస్యలైన త్రాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ యువతలో నైపుణ్యాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. ఈ సంస్థ ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణాతో పాటు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిస్సా, తమిళనాడు రాష్ట్రాలలో కూడా తన కార్యకలాపాలను నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నాడు. ఈ సంస్థ 2010, 2013 సంవత్సరాల్లో యువతలోని నైపుణ్యాల అభివృద్ధి కోసం వివిధ దేశాల ప్రతినిధులతో అంతర్జాతీయ సదస్సులు నిర్వహించిందని, అదేవిధంగా ఆస్ట్రేలియాలోని వృత్తి శిక్షణ సంస్థలతోనూ, అమెరికాలోని అమెరికా సెంటినల్ యూనివర్శిటీతోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని ఆయన తెలిపాడు. గ్రామీణాభివృద్ధి కోసం రవికుమార్‌రెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి అమెరికన్ సెంటినల్ యూనివర్శిటీ ఈ నెల 19వ తేదీన ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను కూడా ప్రదానం చేయడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యధిక గ్రామీణ జనాభా వున్న భారతదేశంలోని గ్రామాల్లో సమగ్రమైన గ్రామీణ, ఆర్థిక సామాజిక వృద్ధి, యువతలోని నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా జాతీయోత్పత్తిని గణనీయంగా పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డాడు. అలాగే తాను గ్రామీణ సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తానని ఆయన అన్నాడు. ఈ సందర్భంగా ఆత్మీయులు, మిత్రులు అందరూ ఆయనకు అభినందనలు తెలిపారు.

**పల్లె ప్రజలకు సమాచార వారధిగా...**

గ్రామీణ ప్రజల వికాసంలో భాగంగా, పల్లె ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన వివరాలను, సమాచార సాయాన్ని గ్రామీణ పేదప్రజలకు పూర్తిస్థాయిలో అందించేందుకు రీడ్స్ సంకల్పించినట్లు ఆయన పేర్కొన్నాడు. ప్రభుత్వ పథకాలను ఎలా వినియోగించుకోవాలో తెలియక అవస్తలు పడుతున్న పేదలకు రీడ్స్ అందించే ఈ సమాచార సాయం ఎంతైనా బృహత్తరమైనదే. నిరుపేదలు ఎవరైనా మరుగుదొడ్డి నిర్మించుకోవాలంటే ఏ అధికారిని కలవాలి? ఎలా ధరఖాస్తు చేసుకోవాలి?.. ఎలా నిర్మించుకోవాలి?.. తదితర విషయాలపై వారికి పెద్దగా అవగాహన వుండదు. ప్రభుత్వ పథకాల ద్వారా వాటికి అందే సహాయం వివరాలు కూడా అనేకమందికి తెలియదు. అందుకే రీడ్స్ ఆ వివరాలన్నిటినీ నిరుపేద ప్రజలకు తెలియజెప్తోంది. తద్వారా పారిశుద్ధ్యం పరిరక్షణకు సంకల్పించారు.

వాస్తవానికి మరుగుదొడ్లను నిర్మించుకోవాలనే ఆలోచన చాలామంది గ్రామీణ పేదలకు వున్నా, ప్రభుత్వం అందుకు అందించే సాయం వివరాలు అనేకమందికి తెలియక చివరికి ఆ ఆలోచనే విరమించుకుంటున్నారంటే అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో, అలాంటి నిరుపేదలకు సరైన అవగాహన కల్పించేందుకు రీడ్స్ సంస్థ ఒక టోల్ ఫ్రీ నంబరును కూడా (040-30911200) ఇటీవల ప్రజలకు అందుబాటులో వుంచింది. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలనుకునేవారికి అవసరమైన పూర్తి సమాచారాన్ని ఈ సంస్థ అందజేస్తుంది. పైన పేర్కొన్న టోల్‌ఫ్రీ నంబరుకు మిస్డ్ కాల్ ఇస్తే చాలు, సంబంధిత ఫోన్ నంబరు నమోదై మెసేజ్ వస్తుంది. కొద్ది గంటల్లోనే ఆ మిస్డ్ కాల్ ఇచ్చినవారికి, కాల్‌సెంటర్ నుంచి ఫోన్ కాల్ వస్తుంది. సంబంధిత వ్యక్తి పేరు-ఊరుతో పాటు, వారి సమస్య ఏదో అడిగి తెలుసుకుని, ఆ సమస్యను తీర్చేందుకు రీడ్స్ సంస్థ ప్రతినిధులు కృషి చేస్తారు. ఈ సంస్థ ఆర్థికంగా వారికి నేరుగా ఎలాంటి సాయం అందించకున్నప్పటికీ, వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకునే పేదకుటుంబాలవారికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సహాయ సహకారాలు అందేవిధంగా తమ తోడ్పాటును అందిస్తుంది. ఇలా అధికారులకు, ప్రజలకు మధ్య సమన్వయకర్తలుగా వుంటూ, వారి సమస్య పరిష్కారమయ్యేంత వరకు బాధ్యత తీసుకోవడమే కాక, మరుగుదొడ్ల నిర్మాణంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందజేస్తారు.



దైనందిన జీవితంలో అత్యంత విలువైన సమయాన్ని వీలయినంత ఎక్కువ ఈ సేవకు వినియోగించడం అభినందనీయం. ఏదేమైనా, ప్రజలకు, ముఖ్యంగా నిరుపేద గ్రామీణులకు అవసరమైన సేవలందిస్తున్న రవిరెడ్డికి అభినందనలు.

# ఇక జనం మధ్యలోనే మద్యం



*రాష్ట్రంలో ప్రజలకు ఏవీ అందుబాటులో లేవు. నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటుతున్నాయి. కూరగాయలు మండిపోతున్నాయి. ఇంధనాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. తిండిటిప్పలకు జనం అల్లాడుతున్నారు. కాసిన ఎండల దెబ్బకు తాగడానికి నీళ్లు కూడా దొరకని పరిస్థితి. అయితే ఈ రాష్ట్రంలో ఇవేవీ దొరకక పోవచ్చు... ఆకలై తిందామంటే సమయానికి హోటల్ ఉండకపోవచ్చు... దప్పికేసినప్పుడు తాగడానికి నీళ్లు లేకపోవచ్చు... అనారోగ్యం పాలైనప్పుడు అత్యవసర మందులకు వెళితే మెడికల్‌షాపు తెరచి ఉండకపోవచ్చు... కాని రాష్ట్ర ప్రజలకు 24×7 సిస్టంలో మద్యాన్ని మాత్రం అందుబాటు లోకి తెచ్చింది ప్రభుత్వం.*

ఒకప్పుడు మద్యాన్ని కొందరు మాత్రమే తీసుకునేవాళ్లు, కాని ఇప్పుడు ఆడ, మగ తేడా లేకుండా అందరూ దానికి బానిసలయ్యేలా సూపర్ మార్కెట్‌లలోనూ, హైపర్‌మాల్స్‌లలోనే కాకుండా గ్రామాలలో ఉండే సహకార సంఘాలలోనూ మద్యం అమ్మకాలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ విధంగా జనం మధ్యకే మద్యాన్ని తీసుకొచ్చే కొత్త ఎక్సైజ్ పాలసీని ఈ సంవత్సరం ప్రభుత్వం చంద్రన్న కానుకగా తెచ్చింది.

ఎన్నికలకు ముందు బెల్టుషాపులు ఎత్తేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చాడు. దాని ప్రకారం ఇప్పుడు బెల్టుషాపులకు బదులు సూపర్‌మార్కెట్లను, గ్రామాలలోని సహకార సంఘాల కార్యాలయాలను మద్యం దుకాణాలుగా మార్చేయనున్నారు. రాష్ట్రంలో ప్రాణం పోయే దశలో వున్న మనిషికి సకాలానికి మందుబిళ్లలు దొరక వేమోగాని, తాగుబోతులకు మాత్రం 24గంటలూ మందు అందుబాటులో ఉండేందుకు ఈ ప్రభుత్వం చేయాల్సిం దంతా చేస్తోంది.

**జిల్లాలో మద్యం జాతర మొదలైంది**

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వన రుల్లో ఒకటైన మద్యం జాతర మళ్లీ మొద లుకానుంది. 2014-15 సంవత్సరానికి సంబంధించిన లీజుల గడువు ముగియ నుంది. గత ఏడాది లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయించడం జరిగింది. గత ఏడాది మద్యం షాపులను దక్కించుకున్న వ్యాపారులు చాలా నిరాశతో వున్నారు. మద్యం వ్యాపారంలో ఆశించిన లాభాలు లేకపోగా, కొన్నిచోట్ల నష్టాలు కూడా తప్పలేదు. దీనికి కారణం ఎక్కువ మంది వ్యాపారులు మద్యం దుకాణాలను లాటరీ తగిలిన వారి నుండి అధికధరలకు కొనుగోలు చేయడమే.

ఈ సంవత్సరం ప్రైవేట్‌తో పాటు ప్రభుత్వం కూడా మద్యం వ్యాపారంలోకి అడుగుపెట్టాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని ఈ నెల 22న ప్రకటించింది. ఇప్పుడున్న మద్యం దుకాణాలతో పాటు 10శాతం అదనపు దుకాణాలను ప్రభుత్వమే నడపనుంది. అలాగే ఈ ఏడాది నుండి హైపర్‌మాల్స్‌లో కూడా మద్యం అమ్మకాలకు ప్రభుత్వం పచ్చజెండా వూపింది.

ఇక జిల్లాలోచూస్తే 348దుకాణాలను లాటరీ పద్ధతిపై కేటాయించనున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో మరో 36దుకా ణాలు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. ప్రతి మండల కేంద్రంలో, మున్సిపాల్టీలలో ఈ దుకాణాలను పెట్టే అవకాశాలున్నాయి. ప్రభుత్వ దుకాణాలలో ఎంఆర్‌పి ధరలకు మద్యం విక్రయాలు జరుగుతాయి. కాబట్టి ఆటోమేటిక్‌గా ప్రైవేట్ దుకాణాలలో కూడా ఎంఆర్‌పి ధరలు అమలవుతాయనేది ప్రభుత్వ ఉద్దేశ్యంలాగుంది. కాని ఇది అమలులోకి వచ్చేసరికి పరిస్థితులు ఇంకెలా మారుతాయో! జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ జరిగింది. ఈ నెల 28న లాటరీ నిర్వహించి, విజేతలకు 29వ తేదీన లైసెన్స్‌లు మంజూరు చేయడానికి రంగం సిద్ధ మైంది. జూలై 1వ తేదీ నుండి లైసెన్స్‌లు పొందిన వాళ్లు వ్యాపారాలు చేసుకోవచ్చు.

అయితే మారిన విధానం, పెరిగిన ఫీజులు, మరోవక్క భారీ లంచాలకు తోడు ప్రభుత్వమే సొంతంగా కొన్ని దుకాణా లను ఏర్పాటు చేస్తున్న తరుణంలో మద్యం వ్యాపారంపై గతంలో ఉన్నంత ఆసక్తి వ్యాపారుల్లో ఇప్పుడు కనిపించకపోవడం విశేషం. జిల్లాలో ఆదాయం బాగుంటుందనే పేరున్న ఆయా ప్రాంతాల షాపులకు మాత్రం పోటాపోటీగా దరఖాస్తులు వేశారు.

# మాటలు తప్ప చేతలేవి?

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాది కాలంలో మంత్రి మూలంగా జిల్లాలో ఒక్క అభివృద్ధి పని జరిగిన దాఖలా కూడా లేదు. ఇరిగేషన్ పనులు ఎక్కడివి అక్కడే ఉన్నాయి. ఎక్కడా ఒక్క కిలోమీటరు రోడ్డు వేసిన దాఖలాలు లేవు. పారిశ్రామికంగా ఒక్క ప్రాజెక్ట్ రాలేదు.

ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి... ఈ జిల్లా నుండి ఇంకా ఎందరో మంత్రులుగా పనిచేసారు. తమ కాలంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులను కొన్నింటినన్నా సాధించారు. కాని నారా యణ ఈ ఏడాది కాలంలో సాధించిందేమీ



గతుకులమయంగా మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డు

లేదు. ఏదన్నా చేయాలన్న ఆసక్తి కూడా ఆయనలో కనిపించడం లేదు. నెల్లూరు మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డులో నిత్యం విఐపిల రాకపోకలు సాగుతుం టాయి. నెల్లూరుకు వస్తే ముఖ్యమంత్రైనా, చివరకు నారాయణ అయినా ఈ రోడ్డులో పోవాల్సిందే! గుంతలమయమైన ఈ రోడ్డును కూడా ఆయన పట్టించుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి రోడ్లు కోకొల్లలుగా వున్నాయి. ప్రజల అవస్థలు ఏ మాత్రం పట్టని మంత్రి మనకే దొరకడం మన బ్యాడ్‌టైం!

# కయ్యమా? వియ్యమా?

(మొదటిపేజీ తరువాయి)

టెలిఫోన్ సంభాషణలు బయటపడ్డాక తన ఫోన్‌ను ట్యాపింగ్ చేసారని, కట్ అండ్ పేస్ట్ చేసి టేపులు సృష్టించారని చంద్రబాబు ఆరోపించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఆ టేపులన్నీ కూడా నిజమైనవేనని ఫోరెన్సిక్ నిపుణులు తేల్చారు. దీంతో ఏసిబి అధికా రులు చంద్రబాబు స్వరపరీక్ష కోసం కోర్టులో పిటిషన్ వేసారు. కోర్టు అనుమ తిస్తే ఆయనకు స్వరపరీక్షలు చేయడం, నోటీసులు జారీ చేయడం కూడా చేయొచ్చు. ఇదంతా చట్టప్రకారం తెరమీద కనిపించే ప్రక్రియ.

మరోపక్క ఈ కేసులో కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకుందని, ఇరు రాష్ట్రాల వారిని శాంతింప చేసే ప్రక్రియ చేపట్టిందని తెలు స్తోంది. ఓటు-నోటు కేసును ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూర్చోబెట్టి గవర్నర్ పరిష్కరించవచ్చంటూ భారత అటార్నీ జనరల్ ఉచిత సలహా ఒకటిచ్చారు. ఇరు రాష్ట్రాల మధ్య నీళ్ల వివాదమో, కరెంట్ వివాదమో, ఇంకేదన్నా సమస్యో వుంటే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూర్చో బెట్టి గవర్నర్ అలాగే చేయొచ్చు. కాని ఇది సమస్య కాదు. నేరం. నేరాన్ని రాజీ చేసు కోమని అటార్నీ జనరల్ సలహా ఇవ్వడ మేంటి? నేరంపై కోర్టులో విచారణ జర గాలి. ఓటు కొనుగోలుకు ప్రయత్నించి వుంటే తెలుగుదేశం వాళ్లకు, ఒక సీఎం ఫోన్ ట్యాపింగ్ చేసి వుంటే టీఆర్ఎస్ ప్రభుత్వానికి శిక్షపడాలి. అంతేగాని నేరంపై రాజీ పడమనడమేమిటి? కేసులో కేంద్రం వేలుపెట్టిందనే విషయం ఇక్కడే అర్ధమవుతుంది. ఈ విషయంలో చంద్ర బాబుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా అభయహస్తం అందించాడని తెలుస్తోంది. ఆచితూచి స్పందించడం ద్వారా కేంద్రం కూడా ఈ కేసును నీరు గార్చే ప్రయత్నం చేస్తుంది. మరి ఈ కేసులో నిందితులను చించేస్తాను, ఆరేస్తాను, పాతరేస్తాను అంటూ విర్రవీగిన కేసీఆర్ అదే మాటకు కట్టుబడతాడో లేక నీరుగారి పోతాడో కాలమే నిర్ణయించాలి. కేసు విషయంలో ఆయన రాజీపడ్డాడంటే చంద్రబాబు ఆరోపించినట్లు ఆయన ఫోన్ ట్యాపింగ్ నేరానికి పాల్పడినట్లేననుకోవచ్చు.

# డబుల్ యాక్షన్

(మొదటిపేజీ తరువాయి)

నిక్కచ్చిగా వ్యవహరించే వ్యక్తిగా పేరుంది. ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. అధికారికంగా నివాసం ఉంటున్నాడు కాబట్టి తెలంగాణలోని హైదరాబాద్‌పై, ఆధ్యాత్మికంగా అత్యంత ఎక్కువగా ఇష్టపడుతుంటాడు కాబట్టి ఆంధ్రాలోని తిరుమల ప్రాంతాలపై ఆయనకు ఆసక్తి ఎక్కువ.

విభజన తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య కరెంట్, నీళ్ల విషయంలో చిన్న గొడవలు తప్పితే పెద్దగా వివాదాలొచ్చింది లేదు. తొలినాళ్లలో హైదరాబాద్‌లోని ఆంధ్రావాళ్లపై విషంకక్కిన కేసీఆర్, ఇప్పుడు గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చల్లబడ్డాడు. అయితే తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు-నోటు వివాదం ఇరు రాష్ట్రాల ముఖ్య మంత్రులు, ప్రభుత్వాల మధ్య చిచ్చు రేపింది. కొన్ని రాజకీయ శక్తులు దీనిని ఇరు ప్రాంతాల ప్రజలకు అంటించాలని చూసాయి గాని, ప్రజలు అంతగా ఆవేశ పడలేదు. ఓటు-నోటు కేసులో తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన వైఖరిపై తెలుగుదేశం నాయకు లకు గుబులు పట్టింది. ఎక్కడ చంద్రబాబును అరెస్ట్ చేస్తారోననే భయం పట్టుకుంది. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు క్షీణించాయని, సెక్షన్-8 ప్రకారం ఉమ్మడి రాజధానిలో శాంతి భద్రతల పర్యవేక్షణ గవర్నర్‌కు అప్పగించాలంటూ తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టారు. కొంతమంది ఆ పార్టీ నాయకులైతే గవర్నర్ పైనే తీవ్రస్థాయిలో విమర్శలకు దిగారు. దీనికి కారణం గవర్నర్ తమకు వ్యతిరేకంగా కేంద్రానికి నివేదికలు ఇచ్చాడనే కోపమే.

అయితే సెక్షన్-8 అమలుకు గవర్నర్ సుముఖత చూపకపోవడం తెలుగుదేశం వారిని విస్మయపరిచింది. గవర్నర్ పరిస్థితి ఎలా వుందంటే తెలుగుదేశం వారిని సంతృప్తి పరచడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో శత్రుత్వం ఎందుకన్నట్లుగా వుంది. గవర్నర్ ఇరు ప్రభుత్వాలకు సమాంతర దూరం పాటిస్తున్నారు. హైదరాబాద్‌లో ఏం జరిగిందో, జరుగుతుందో అదే కేంద్రానికి తెలుపుతున్నారు. రెండు రాష్ట్రాలతో తలనొప్పి లేకుండా తప్పించుకుంటున్నాడు.

## మానసిక ఒత్తిడి నివారణా మార్గం యోగా

ఈ నెల 21వ తేదీ నెల్లూరు, వాత్సల్యలోని భారతీయ విద్యావికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో జరిగిన అనూష మెమోరియల్ చెస్, క్యారమ్స్ స్పోర్ట్స్ మీట్ విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా॥ సి.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిడికి దూరంగా ఉండేందుకు యోగా ఒక సాధనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య ఆర్గనైజింగ్ కార్యదర్శి జివి సాంబశివరావు, చెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరి సుమన్, ఏపియుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.జయప్రకాష్ ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.


## కాలధర్మం

### నర్రా రమణమ్మ



నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లో వున్న ప్రముఖ వ్యాపారవేత్త నర్రా ఈశ్వర్‌రెడ్డి మాతృమూర్తి నర్రా రమణమ్మ ఈ నెల 24వ తేదీ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు నర్రా ఈశ్వర్‌రెడ్డి వ్యాపారవేత్తగా, గతంలో తెలుగుదేశం పార్టీ నాయకులుగా నగరంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు దాతగా అందరికీ సుపరిచితుడే. రమణమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### కాటంరెడ్డి శేషురెడ్డి



నెల్లూరు, ధనలక్ష్మీపురంలోని కెజికె కల్యాణ మండపం అధినేత కాటంరెడ్డి గోపాలకృష్ణారెడ్డి తండ్రి కాటంరెడ్డి శేషురెడ్డి ఈ నెల 24వ తేదీన స్వర్గస్థు లయ్యారు. ఆయన వయసు 80సంవత్సరాలు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కొడుకు కాటంరెడ్డి గోపాలకృష్ణారెడ్డి కెజికె కల్యాణ మండపం అధినేతగా అందరికీ సుపరిచితుడే! శేషురెడ్డి చిన్నతనం నుండే వ్యవసాయంలో కష్టపడుతూ తన బిడ్డల ఉన్నతికి కృషి చేసాడు. శేషురెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## కళాక్షేత్రం ప్రాంగణంలో

# సాంబమూర్తి విగ్రహం



భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ వ్యవస్థాపకులు, ప్రపంచం మెచ్చిన పాటల మాంత్రికుడు, గాన గంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వంటి సంగీత శిఖరానికి జన్మ నిచ్చిన పితృదేవుడు శ్రీపతి పండితా రాధ్యుల సాంబమూర్తి విగ్రహాన్ని నెల్లూరు, దర్గామిట్టలోని కస్తూర్బా కళాక్షేత్రం ప్రాంగణంలో నెలకొల్పనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం.578 కూడా విడుదల చేసింది. సాంబమూర్తి విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన భూమిపూజను జూలై 3వ తేదీ ఉదయం 7గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో నగరప్రముఖులు, సంగీత ప్రియులు, ఎస్పీ బాలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్లు సాంబమూర్తి విగ్రహ నిర్మాణ కమిటి తెలిపింది.

త్యాగరాజ కీర్తనలను నెల్లూరీయులకు పరిచయం చేసిన సంగీత పండితుడు సాంబమూర్తి. నెల్లూరులో ఆయన త్యాగ రాజ ఉత్సవాలను ప్రారంభించి మొన్ననే 50ఏళ్లు పూర్తయ్యాయి. ఆ మహనీయుడి వల్లే నెల్లూరు దక్షిణ భారతదేశంలో మరో తిరువాయూర్‌గా గణతికెక్కింది. నెల్లూరులో అర్హులకే కాకుండా అనర్హులకి కూడా కొన్ని విగ్రహాలున్నాయి. సంగీత ప్రపంచంలో నెల్లూరుకు ఒక గుర్తింపు తెచ్చిన సాంబమూర్తి విగ్రహాన్ని పెట్టడానికి గత 5ఏళ్ల నుండి ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. సాంబమూర్తి త్యాగ రాజ ఉత్సవాలకు వేదికైన పురమందిరంలో ఆయన విగ్రహాన్ని స్థాపించాలని చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. కళాక్షేత్రం ప్రాంగణంలో సాంబమూర్తి విగ్రహ ఏర్పాటుకు జిల్లా ఉన్నతాధి కారులను అభ్యర్థించడం జరిగింది. జిల్లా కలెక్టర్ దీనిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో, ప్రభుత్వం వెంటనే దీనిపై స్పందించింది. కళా క్షేత్రం ప్రాంగణంలో పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహం పక్కనే సాంబమూర్తి విగ్రహం ఏర్పాటుకు అనుమతిస్తూ రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి టి.సి.శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేగాక ఈ విగ్రహం నిర్వహణను కూడా జిల్లా రెవెన్యూశాఖకే అప్పగిస్తున్నట్లు ఆ జిఓలో స్పష్టం చేశారు.

ఓ పక్క ఘంటసాల... ఇంకో పక్క సాంబమూర్తితో కస్తూర్బా కళాక్షేత్రానికే సంగీత కళ రానుంది.

### సాంబమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన కమిటి

సాంబమూర్తి విగ్రహాన్ని నెల్లూరులో ప్రతిష్ఠించడానికి శ్రీ శ్రీపతి పండితా రాధ్యుల సాంబమూర్తి గారి విగ్రహ ప్రతిష్ఠాపన కమిటి ఏర్పడింది. ఈ కమిటీకి గౌరవాధ్యక్షులుగా పద్మభూషణ్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షులుగా మురళీ కృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్య, ఉపాధ్యక్షులుగా మురళీకృష్ణ హోటల్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, ముఖ్య సమన్వయకర్తగా 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, గౌరవసభ్యులుగా టివిఎస్ చలపతిరావు, యనమండ్ర నాగదేవిప్రసాద్, కనుమూరు శ్రీనివాసులురెడ్డి, దండ మూడి హేమంత్‌కుమార్, వీరిశెట్టి శ్రీనివాసరావులు వ్యవహరించనున్నారు.

# 'రవి' ఆసుపత్రికి అంతర్జాతీయ గుర్తింపు




నెల్లూరంటే రంగడి గుడి, విఆర్‌సి బడి, పెన్నా సందడి గుర్తుకువస్తాయి. చిన్నపిల్లల వైద్య రంగంలో నెల్లూరుకు గుర్తింపు తెచ్చింది రవి చిన్నపిల్లల ఆసుపత్రే! ఒక్క నెల్లూరుజిల్లాకే కాదు, చుట్టుపక్కల చిత్తూరు, కడప, ప్రకాశం, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో రవి చిన్నపిల్లల ఆసుపత్రి అంటే తెలియనివారుండరు. ఎన్నో వేలమంది చిన్నారులకు ఆపత్కాలంలో పునర్జన్మనిచ్చిన వైద్యసంస్థ ఇది. ఒక్క ఆసుపత్రి ద్వారానే కాదు, అనుబంధంగా నెలకొల్పిన వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కూడా చిన్న పిల్లలకు, పురిటి బిడ్డలకు, మానసిక వికలాంగులకు చేయూతనిస్తూ... వారి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. అలాంటి వైద్య సంస్థకు అరుదైన, అర్హతకు తగిన గౌరవం దక్కింది. డాక్టర్ టి.రవికుమార్ చిన్నపిల్లల హాస్పిటల్(రిచ్)కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థల్లో ఒకటైన యాక్సెస్ హెల్త్ ఇంటర్నేషనల్ సంస్థ పురిటి బిడ్డల మరణాలను తగ్గించేందుకు రిచ్ హాస్పిటల్‌తో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చింది. అందులో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులు సోమవారం రిచ్ హాస్పిటల్‌ను సందర్శించారు. అక్కడ పిల్లలకు అందుతున్న వైద్యసేవలు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం సంస్థ ప్రతినిధి డాక్టర్ సంతోష్ విలేకర్లతో మాట్లాడుతూ తల్లి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం, రక్తహీనత, కాన్పుకు కాన్పుకు మధ్య వ్యవధి లేకపోవడం తదితర కారణాలతో నెలలు తక్కువతో బిడ్డలు పుడుతున్నారన్నారు. అలాంటి వారికి సకాలంలో సరైన వైద్యసేవలు అందిస్తేనే బతికే అవకాశం ఉందన్నారు. రిచ్ హాస్పిటల్‌లో అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. దీంతో తాము రిచ్ హాస్పిటల్‌తో కలిసి జిల్లాలో పురిటిబిడ్డల మరణాలను తగ్గించేందుకు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళుతున్నామన్నారు. రిచ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ టి.రవికుమార్ మాట్లాడుతూ పురిటిబిడ్డలను తమ హాస్పిటల్‌కు తీసుకువస్తే వారి జబ్బులను ముందుగానే గుర్తించి అత్యాధునిక వైద్యసేవలు అందిస్తామన్నారు. అనంతరం నియోనెటల్ రిజిష్టర్‌ను ప్రారంభించారు. చిన్నారి లోకానికి అందిస్తున్న తమ వైద్యసేవలతో నెల్లూరుజిల్లాకే అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చిన రిచ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ రవికుమార్‌కు 'లాయర్' అభినందనలు.




## ఉత్తరక్రియలు

కల్మషమెరగని మంచి మనసుతో
అందరి ఆదరాభిమానాలు పొందిన మానవతామూర్తి
అంతులేని ఆప్యాయత అనురాగాలతో
మాకు ప్రేమానురాగాలు పంచి,
మా ఉన్నతికి కృషి చేసిన మా తల్లి గారు

# శ్రీమతి నర్రా రమణమ్మ గారు

తే. 24.06.2015ది స్వర్గస్తురాలైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు - కోడలు
**నర్రా ఈశ్వర్‌రెడ్డి - విజయలక్ష్మి**

కుమార్తెలు - అల్లుళ్లు
**కోటేశ్వరమ్మ - లేట్ పాలిచర్ల గోపాల్‌రెడ్డి**
**పరమేశ్వరమ్మ - వేమిరెడ్డి మురళీధర్‌రెడ్డి**

మనుమడు
**నర్రా రూపేష్‌కుమార్‌రెడ్డి - ధనలక్ష్మి**

మునిమనుమలు
**నర్రా తేజేశ్వర్‌రెడ్డి, నర్రా విశ్వనాథ్‌రెడ్డి**

**పెద్దకర్మ :** తేది. 26.06.2015, శుక్రవారం ఉ॥ 9.00గంటలకు నెల్లూరు, మాగుంట లే అవుట్, సెంట్రల్ అవెన్యూ, 2వ క్రాస్‌రోడ్డులోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com